


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


### ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 55 | మంగళవారం 24 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3




2లో

## డ్రగ్ మాఫియా డాన్ మృతిపై

# ట్రంప్ రియాక్షన్..!

**"మనం అతిగా గెలుస్తున్నాం" అంటూ ట్రూత్ సోషల్ లో సందేశం**

**అమెరికాలోకి మాదకద్రవ్యాలు పంపే వారికి శిక్ష తప్పదని వార్నింగ్**

**అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారిన ట్రంప్ పోస్ట్**

మెక్సికోలో అత్యంత శక్తిమంతమైన 'జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్' అధిపతి నెమీసియో ఒసెగువేరా (60) అలియాస్ "ఎల్ మెంచో" మెక్సికన్ ప్రత్యేక దళాల ఆపరేషన్‌లో గాయపడి, బలగాల కస్టడీలో మరణించాడు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తన ట్రూత్ సోషల్‌లో "మనం అతిగా గెలుస్తున్నాం, ఇది అసలు న్యాయమే కాదు!" అంటూ పెట్టిన క్లుప్తమైన సందేశం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

**అమెరికా నిఘా వర్గాల సహకారం..**

మెక్సికోలోని తపాల్పాలో జరిగిన ఈ మెరుపు దాడిలో ఎల్ మెంచో పట్టుబడ్డాడు. అమెరికా నిఘా వర్గాల సహకారంతో మెక్సికో సైన్యం ఈ ఆపరేషన్ నిర్వహించింది. ఎల్ మెంచో మృతి వార్తతో మెక్సికోలోని ఆరు రాష్ట్రాల్లో డ్రగ్ గ్యాంగ్‌లు విధ్వంసానికి దిగాయి. వాహనాలను తగులబెట్టడం, రహదారుల దిగ్బంధనంతో పర్యాటక ప్రాంతాలు యుద్ధ క్షేత్రాలను తలపించాయి.



2లో

# బీఆర్ఎస్ నడిగడ్డను మోసం చేసింది

**రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం**

**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు.

ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



2లో

**పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**

**గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది.

## కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత



**ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత**

2లో

**పరీక్షించిన వైద్యులు..రెస్ట్ తీసుకోవాలని సూచన**



## సామాజిక సమానత్వం అనే

# లక్ష్యం కోసం కృషి

**వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు**

2లో

**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం**


**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు**

**కల్తీపాల మృతుల కుటుంబాలకు పదిలక్షల ఎక్స్‌గ్రేషియా**

**అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన**

సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్



2లో

**రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**ఈ ఘటనలో నలుగురు మృతి, 13 మందికి పైగా అస్వస్థత**

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం**

**ల్యాబ్ రిపోర్టుల తర్వాత నిందితులపై కఠిన చర్యలని స్పష్టం**

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

**ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు**

**బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం**

2లో

**బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**



పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర

## మత్తు మందు ఇచ్చి.. జర్నలిజం విద్యార్థినిపై ప్రియుడు, అతడి స్నేహితుడి ఘాతుకం

బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో దగ్గరైన ప్రియుడే తన స్నేహితుడితో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 19 ఏళ్ల ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మత్తు మందు ఇచ్చి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అమృతహళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 64, 70(1), 351(2) కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల కథనం ప్రకారం, తమిళనాడుకు చెందిన బాధితురాలు బెంగళూరులోని ఓ ప్రముఖ కళాశాలలో జర్నలిజం, సైకాలజీ చదువుతోంది. ఐదు నెలలుగా పీజీ హాస్టల్‌లో ఉంటోంది. ఈ ఏడాది జనవరిలో డిక్సన్ సాంద్రా అనే యువకుడితో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ల తర్వాత సాంద్రా ఆమెకు ప్రపోజ్ చేయగా అంగీకరించింది.



2లో

**బెంగళూరులో దారుణం**

**విల్లాకు పిలిచి మత్తు మందు ఇచ్చి అఘాయిత్యం**

**ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమె ప్రేమ పేరుతో వంచన**

**విషయం బయటపెడితే తీవ్ర పరిణామాలుంటాయని నిందితుల బెదిరింపు**

**బాధితురాలి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు**

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యువత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ. 2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ది చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## మత్తు మందు ఇచ్చి.. జర్నలిజం విద్యార్థినిపై ప్రియుడు, అతడి స్నేహితుడి ఘాతుకం

ఫిబ్రవరి 14న రాత్రి తనను జక్కూర్‌లోని ఓ విల్లాకు రావాలని సాండ్రా కోరాడని, దాంతో అక్కడికి వెళ్లానని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. అక్కడ సాండ్రా స్నేహితుడు నిఖిల్ కూడా ఉన్నాడని... కాసేపటి తర్వాత వారిద్దరూ బలవంతంగా తన నోట్లో రోజ్ కలర్ టాబ్లెట్ వేశారని, పది నిమిషాల్లోనే తనకు కళ్లు తిరగడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించాయని వివరించింది. ఆ తర్వాత సాండ్రా తనను ఓ గదిలోకి తీసుకెళ్లారని, కొంతసేపటి తర్వాత స్పృహ కోల్పోయానని తెలిపింది. మెలకువ వచ్చి చూసేసరికి శరీరంపై దుస్తులు తొలగిపోయి ఉన్నాయని, నిఖిల్ తన పక్కనే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఆ తర్వాత సాండ్రా కూడా తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించింది. అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని, గదిలో బంధించారని వాపోయింది. మరుసటి రోజు మధ్యాహ్నం తనను విడిచిపెట్టారని వెల్లడించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని నిఖిల్ బెదిరించాడని బాధితురాలు చెప్పింది. మొదట భయపడినా, ఫిబ్రవరి 17న ధైర్యం తెచ్చుకుని, తన సోదరుడికి విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

**మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు**

**స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం**

**మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం**

**డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్**

**ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు**

**మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు**

**అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు**

**మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు**

**తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు**

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ. 2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ. 13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ. 15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ. 13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ. 2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది.

# సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి

తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ. 3 లక్షల నుంచి రూ. 54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిరచారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించిందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

# నల్లగొండలో డెస్క్ జర్నలిస్టుల ఆందోళన



**నల్లగొండ,ఫిబ్రవరి23** : అక్రిడిటేషన్ల విషయంలో డెస్క్ జర్నలిస్టులకు చాలా అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య పెంచి అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఆధ్వర్యంలో సోమవారం వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించారని, గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ సెంటర్‌లో 8 మంది డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వగా ప్రస్తుతం కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రిడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టారని, ఈ నిబంధన వల్ల చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్లకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్క్‌లు వేరుగా ఉంటాయని ప్రతి జిల్లాకు ఒక ఇన్‌చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారన్నారు. జీఓ ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్‌చార్జిలకు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో పనిచేసే తాము తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేనివాళ్లమని, కనీసం అక్రిడిటేషన్ కార్డు ఉంటే హెల్త్ కార్డు అయినా తమకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి డెస్క్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు వచ్చేలా చూడాలని కోరారు. ఈ ధర్నాకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే 143, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు.

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ

అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## సరోగసి అక్రమాలపై విచారణ

సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది.

# బీఆర్ఎస్ నడిగడ్డను మోసం చేసింది

జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు. సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

## డ్రగ్ మాఫియా డాన్ మృతిపై ట్రంప్ రియాక్షన్ ..!

**ట్రంప్ హెచ్చరిక..** అమెరికాలోకి డ్రగ్స్ పంపే నార్కో ఉగ్రవాదులు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందేనని ట్రంప్ యంత్రాంగం స్పష్టం చేసింది. గతంలో పట్టుబడ్డ 'ఎల్ చాపో' వంటి వారి సరసన ఎల్ మెంచో మృతి కూడా మెక్సికో డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో అతిపెద్ద విజయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం మెక్సికో అంతటా భద్రతా దళాలను మోహరించారు. విమాన సర్వీసులు నిలిచిపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ స్జబెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ స్జబెక్టులకు, రెండో సంవత్సరం అన్ని స్జబెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శు భాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్ధులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

# రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి నలుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రాజమండ్రిలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, లాలాచెరువు ప్రాంతాల్లో కల్తీ పాలు సేవించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మరణించగా, 13 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చాలామంది కిడ్నీలు పూర్తిగా పనిచేయకపోవడంతో (అనూరియా) బాధపడుతున్నట్లు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పాలు సరఫరా చేసిన కొరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే విక్రేతను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అధికారులు ప్రభావిత ప్రాంతాల్లోని సుమారు 106 కుటుంబాలపై సర్వే చేపట్టారు. 75 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలతో పాటు, పాల శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం విశాఖపట్నం ల్యాబ్‌కు పంపారు. ఈ ల్యాబ్ నివేదికలు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్భంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావారణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

## లోకేశ్, చంద్రబాబుల ఆదేశాలతోనే దాడి

తన ఇంటిపై జరిగిన దాడికి చంద్రబాబు, లోకేష్ ఆదేశాలే కారణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి పునరుద్ఘాటించారు . సాయంత్రం ఐదునుంచి రాత్రి పన్నెండు గంటలవరకూ తన ఇంటిపై దాడి జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని, ఇది చంద్రబాబు, లోకేష్‌ల కుట్ర కాదా? అని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన అంబటి.. ' రాజమండ్రి జైలు నుంచి విడుదలైనప్పటినుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి సంఘీభావం ప్రకటించారు. వారందరికీ నా ధన్యవాదాలు. నేను జైలులో ఉన్నప్పుడు మా అధినేత జగన్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. 18 రోజులు జైలులో ఉండి బయటకు వచ్చిన తర్వాత ప్రెస్ మీట్ పెట్టి వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశాను.

# అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



**నంది పత్రిక ప్యాపిలి** అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బూరుగల గ్రామంలో చోటుచేసుకుంది. బూరుగల గ్రామానికి చెందిన కొక్కంటి రామకృష్ణ (55) అనే రైతు గత కొంతకాలంగా 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. అయితే, వ్యవసాయంలో ఆశించిన దిగుబడి రాకపోవడం, పెట్టుబడుల కోసం సుమారు 10 లక్షల రూపాయల వరకు అప్పులు కావడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో, జీవితంపై విరక్తి చెంది తన పొలంలోనే పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం యాడికి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక రామకృష్ణ మృతి చెందారు. మృతుడికి భార్య కదిరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడి వీడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి వెటర్నరీ ఏడీ డాక్టర్ ఎస్. విక్టర్



**నంది పత్రిక ప్యాపిలి** పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళనకు లోనుకాకుండా, ప్రశాంత చిత్తంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్యాపిలి ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ (పశుసంవర్ధక శాఖ) డాక్టర్ ఎస్. విక్టర్ పిలుపునిచ్చారు. సోమవారం ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన '100 రోజుల యాక్షన్ ప్లాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనపై తాను నమ్మకం ఉంచుకోవాలని, పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధమైనప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళికను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచించారు. పరీక్షలు అంటే భయం కాదని, అది ఒక మైలురాయి మాత్రమేనని పేర్కొన్నారు. ప్రశాంతమైన మనసుతో చదివిన అంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని వివరించారు. రాబోయే వార్షిక పరీక్షల్లో ఏనుగుమర్రి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**నంది పత్రిక -ప్యాపిలి** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో మొదటి రోజు పరీక్ష సజావుగా సాగింది. ఈ పరీక్షకు మొత్తం 166 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వారిలో 148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 18 మంది విద్యార్థులు గైరుహాజరైనట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. **పరీక్షల నిర్వహణను అధికారులు నిశితంగా పరిశీలించారు.** చీఫ్ సూపరింటెండెంట్: ఎం.డి. ముస్తాఫ్ అహమ్మద్ పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఎస్. చౌడప్ప పరీక్షా కేంద్రంలో నిబంధనల అమలును తనిఖీ చేశారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, వెలుతురు వంటి కనీస వసతులను కళాశాల యాజమాన్యం కల్పించింది. నిబంధనల ప్రకారం పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# రైతులతో రాజకీయ చెలగాటం

### జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు బిజ్జం

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 24 :** యూరియా పంపిణి విషయంలో కొందరు నాయకులు రాజకీయ చెలగాటం ఆడుతున్నారని నంద్యాల జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు బిజ్జం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. సోమవారం బండి ఆత్మకూరులో ఒక సమావేశంలో బిజ్జం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు యూరియా పంపిణీ విషయంలో ఎలాంటి కొరత లేకుండా మంజూరు చేస్తున్నారని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం జరిగిందని బిజ్జం పేర్కొన్నారు. కానీ నంద్యాల జిల్లాలో అనేక గ్రామాలలో యూరియా కొరత ఉందంటూ లేనిపోని రాద్ధాంతాలను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. పల్లె ప్రాంతాలలో యూరియా కొరత ఏర్పడేందుకు కేంద్రంల ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమే కారణమని దుష్ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలతో ప్రతిపక్ష పార్టీ నాయకులకు అవకాశం ఇచ్చి వారు కూడా ప్రభుత్వాన్ని విమర్శించేలా అవకాశం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. రైతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి అన్నదాతలను వ్యవసాయ రంగ విధానాన్ని ప్రపంచంలోనే దిగ్గజంగా నిలబెట్టాలని భారతదేశాన్ని ప్రపంచ శక్తిగా మార్చాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంతరం ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఇందుకు భిన్నంగా గ్రామాలలో జరుగుతున్న తీరును, రైతులను మభ్య పెట్టే దిశగా ప్రయత్నాలు చేస్తూ ఉంటే జాలి కలుగుతుందని అన్నారు. రైతుల పట్ల రాజకీయ కోణంతో కాకుండా సుహృద్భావధోరణితో తెలుగుదేశం పార్టీ నాయకులు వ్యవహరించాలని బిజ్జం సూచించారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని ఆరుగాలం శ్రమించే రైతన్నకు భరోసాగా నిలిస్తేనే ప్రభుత్వాలకు మొనగాడు ఉంటుందని లేదంటే గత వైసిపి ప్రభుత్వాల మాదిరి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బిజ్జం వెంకటసుబ్బారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వము అంటూనే జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల విషయంలో బిజెపి నాయకులకు ప్రాధాన్యత కల్పించడం లేదని అన్నారు ఈ అంశాలన్నిటిని సద్విమర్శగా తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకోవాలని విజయం సూచించారు. శంలో కిసాన్ మోర్చా జిల్లా నాయకులు చిరంజీవి రెడ్డి, సాయి దత్త, నాగేశ్వర్రెడ్డి, రామచంద్రారెడ్డి,శివారెడ్డి, మధు,బొమ్మిరెడ్డి శివరామిరెడ్డి,బాలరాజు, ధర్మారెడ్డి,వెంకటయ్య, మల్లికార్జున,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలి

### -నూతన కౌలుచట్టం ఏర్పాటు చేయాలి.



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 23 . (నంది పత్రిక )**:ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం మరియు రైతు సంఘాల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు 36 గంటల నిరసన దీక్షను కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి రమేష్ కుమార్ ప్రారంభించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడుఏ. రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన దీక్షలో కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రోజురోజుకు కౌలు రైతుల సంఖ్య పెరిగిపోతుందని, సొంత భూమి గల రైతులతో సమానంగా పంటలు ఉత్పత్తి చేస్తున్న కౌలు రైతులకు అవసరమైన కౌలు గుర్తింపు కార్డులు,పంట రుణాలు, పంటనష్టపరిహారాలు, సబ్సిడీ విత్తనాలు ఎరువులు మరియు మద్దతు ధరలు వర్తింప చేయకపోవడం, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా పెట్టుబడి సహాయం ఇరవై వేల రూపాయలు 20 నెలలు గడిచిన ఇవ్వకపోవడం వల్ల కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద పెట్టుబడులబడుల కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుల బాధలు అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య లు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది అన్నారు. ఎన్నికల సమయాల్లో అనేక రకాల హామీలు ఇచ్చే ప్రభుత్వాలు గతంలో జగన్ ప్రవేశపెట్టిన కౌలు చట్టం బాగోలేదని సమగ్రమైన కౌలు చట్టం తీసుకువస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 20 నెలలు గడిచినా కూడా రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క కౌలు రైతుకు పెట్టుబడి సహాయం 20,000 ఇవ్వకపోవడం, సమగ్రమైన కౌలు చట్టం తీసుకు రాకపోవడం అన్యాయ మన్నారు. అందువల్లనే మొద్దు నిద్రపోతున్న రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు కౌలు రైతు సంఘాలు నేటి నుండి 36 గంటల పాటు నిరసన దీక్షలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని, జరగబోవు అసెంబ్లీ సమావేశాల్లోనైనా చర్చించి కౌలు రైతులను కాపాడే విధంగా నూతన కౌలు చట్టం తీసుకురావాలని, ఒకే దఫాలో పెట్టుబడి సహాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు వెంటనే కౌలు రైతుల అకౌంట్లో జమ చేయాలని, సొంత రైతు సంతకంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి బ్యాంకుల ద్వారా అవసరమైన పంట రుణాలు ఇవ్వాలని, ఈ క్రాప్ నమోదులో కౌలు రైతుల పేర్లు నమోదు చేసి, వాటి ఆధారంగా సబ్సిడీ విత్తనాలు ఎరువులు మరియు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, కులాలతో సంబంధం లేకుండా ఓసి రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ,ఆర్బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులందరికీ రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు ఇవ్వాలని, పంట నష్టపోయి తీవ్రంగా అప్పులపాలై ఇబ్బంది పడుతున్న రైతులు కౌలు రైతుల పై ఉన్న అన్ని రకాల అప్పులను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మార్క్, అధ్యక్షుడు నరసింహుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి సుబ్బారాయుడు మాట్లాడారు. అనంతరంసిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెన్న బాల వెంకట్, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాయక్ మద్దతు తెలిపారు. నిరసన దీక్షలో కౌలు రైతు సంఘం నాయకులు ఏలియా, గద్దం కుమారి మరియు ఆంధ్రప్రదేశ్ రైతు,కౌలు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్, వీరన్న,స్వాములు, శ్రీనివాసులు,మద్దిలేటి స్వామి రైతులు కూలీలు చెన్నయ్య, కరీముల్లా, అంబయ్య, గద్దం పుల్లమ్మ ,సీమోను, సంజీరాయుడు, వెంకటసుబ్బయ్య, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నదేవాళాపురంలో అగ్ని ప్రమాదం





### ఏడు పశువులు సజీవ దహనం

**బండిఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 24:** బండిఆత్మకూరు మండల పరిధి లో ఉన్న చిన్నదేవాలాపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఒక అగ్నిప్రమాదంలో ఏడు బర్రెలు సజీవ దహనమైపోయాయి. స్థానికుడైన మాబుసా అనే వ్యక్తి తనకు సబంధించిన పశువుల పాకలో దోమలను నివారించేందుకు గాను పూరిపాకలో పొగబెట్టి ఇంటికొచ్చి పడుకొన్నాడు. ప్రమాదవశాత్తు పొగ కాస్త మంటగా మారిపోయి పశువుల పాకకు నిప్పంటుకొని ఏడు బర్రెలు మంటల్లో చిక్కుకొని సజీవదహనమైపోయాయి. మరికొన్ని పశువులు గాయాలకు గురిఅయ్యాయి. దాదాపు 5లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ విషయం తెలిసిన వెంటనే వెలుగోడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు,బండిఆత్మకూరు,మొత్కూరు పశు వైద్యాధికారులు,అనూష,కిషోర్ కుమార్ రెడ్డి తమసిబ్బంది తో కలసి చిన్న దేవళాపురం గ్రామానికి చేరుకున్నారు. గాయపడిన పశువులకు, లేగదూడలకు,ప్రథమ చికిత్సలు చేశారు. బాదితుడికి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలను అందజేస్తామని ఏ డి ఎ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదం సంఘటన తెలిసిన వెంటనే మండల పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి సంజీవరెడ్డి గ్రామానికి చేరుకొని భాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు.



# మూగ (జీవుల ) రోదన



**బండిఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 24:** ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా ఏడు పశువులు (బర్రెలు) అగ్ని మంటలలో పడి సజీవ సమాధి అయిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి చిన్నదేవాలాపురం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి పశువులు మంటల్లో పడి మాడి మసి అయిపోయాయి. గ్రామాలలో రాత్రి పూట పశువులు దోమల బారిన పడకుండా ఉండేందుకు పాడిరైతులు అష్ట కష్టాలు పడుతూవుంటారు. పశువుల పాకచుట్టూ దొమతెర గుడ్డలు కట్టేసి లోపల పొగ బెడుతూ ఉంటారు. ఈ కోవలోనే పాడిరైతు మాబుసా కొట్టంలో పొగబెట్టి ఇంటికొచ్చి పడుకొన్నాడ ని తెలుస్తోంది. ఈ కాస్త ఆజాగ్రత్తే ప్రమాదానికి దారి తీసింది. పొగ రూపంలో తమ ప్రాణాలు మరి కాసేపట్లో గాలిలో కలిసిపోతాయన్న ప్రమాదాన్ని ఆ నోరు లేని మూగజీవులు గుర్తించలేక పోయాయి. పొగ కాస్త నిప్పుగా మారపోవడంతో నిప్పుల సెగలతో మూగజీవులు విలవిలలాడిపోయాయి. క్షణాల్లోనే ఏడు పశువులు మంటల్లోనే సజీవదహనమయి పోయాయి. ఈ మంటల సెగల కారణంగా పక్కనున్న పశువులు పెనుగులాడడంతో సుబ్బారాయుడు అనే వ్యక్తి నిదుర లేచాడు. పూరి పాక కాలిపోతుందన్న విషయాన్ని గుర్తించి వెంటనే రైతు మాబుసా ను నిద్దుర లేపాడు. లేచి వచ్చి చూసేసరికే ఏడు పశువులు కాస్త అగ్నికి ఆహతి అయిపోయాయి. వీటితో పాటు మరో మూడు కాలిన గాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మరొక ఏడు ఎనిమిది పశువులు గాయాలకు గురై మూగగా రోధిస్తున్నాయి. మరికొన్ని లేగ దూడలకు కళ్ళు కాలిపోయాయి. వచ్చిపోయే జనాలను చూస్తూ పశువులు మూగ గాను మౌనం గాను బిత్తర చూపులు చూస్తూ, కాలిన గాయాలతో తల్లడిల్లిపోతున్నాయి. రైతు మాబుసా కుటుంబం పాడిపశువులను ఆధారం చేసుకుని ఏళ్ల తరబడి నుండి జీవనం కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పశువులు మృత్యువాత పడటంతో కుటుంబం ఆందోళనలో పడిపోయింది. మండల పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి సంజీవరెడ్డి చిన్నదేవపురం గ్రామాన్ని సందర్శించి బాధిత పాడి రైతు మాబుసాను పరామర్శించారు. సంఘటన తెలిసిన వెంటనే పశువైద్య శాఖకు చెందిన వెలుగోడు సహాయ సంచాలకులు, వెంకటేశ్వర్లు వైద్యాధికారులు అనూష, కిషోర్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పశువులకు వైద్య సేవలను అందిస్తున్నారు. గ్రామాలలో దోమల బెడదను నివారించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# రాష్ట్ర బడ్జెట్లోవ్యవసాయరంగానికి 10% నిధులు కేటాయించాలి

### -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 23 . (నంది పత్రిక )**:ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు 15 వేల రూపాయలు ఇవ్వగా కోటమి ప్రభుత్వం అధికారము కు వస్తే 20000 రూపాయలు అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చి గత సంవత్సరం చాలామందికి అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు జమ కాలేదు అని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న అన్నారు. కుటమి ప్రభుత్వం ఉప దంపుడు ఉపన్యాసం ఇస్తూ రైతులకు పెద్ద పీట వేసేమని అల్లపోలు కబుర్లు చెప్తా ఉన్నారు ,రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు పూర్తిగా నష్టపోతానారు ,గతంలో చాలా సందర్భాల్లో రైతులకు సబ్సిడీ పైన విత్తనాలు పురుగు మందులు ఇవ్వాలని , కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకు కూడా ఇచ్చిన సందర్భాలు లేవు , సూక్ష్మ రుణాలు వడ్డీ లేకుండా 2 లక్షల రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా రాష్ట్ర బడ్జెట్లో రైతులకు 10% నిధులు కేటాయించాలని ఈరోజు నంద్యాల స్థానిక తహసీల్దార్ గారికి వినతిపత్రం అందిస్తూ మండలంలో ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ గత సంవత్సరం బకాయి ఉన్న డబ్బులు రైతులు ఖాతాలో వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ సుబ్బారెడ్డి జిల్లా రైతు సంఘం కార్యవర్గ సభ్యులు పి రాజేశ్వరి ,నాగ శేషులు రామకృష్ణ ,పెద్దారెడ్డి ,కొండా రెడ్డి ,రమణ ,పాల్గొన్నారు.



# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ డిజైన్





నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 23 . (నంది పత్రిక ):నంద్యాల లోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) "డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ మరియు ఇన్నోవేషన్ డిజైన్" అనే కార్యక్రమాన్ని నిర్వహించింది.పరిశోధన మరియు అభివృద్ధి మరియు ఐపిఆర్ సెల్, ఐఐసీ తో కలిసి సంయుక్తంగా డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ మరియు ఇన్నోవేషన్ డిజైన్ పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించాయి.డాక్టర్ హాఫీజ్ బాషా ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఇతర అతిథులు భాగస్వామ్య ఎగ్జిక్యూటివ్ బి. విజయ లక్ష్మి మరియు అబ్రహం అరుణ్ చంద్ ఇంక్యుబేషన్ ఎగ్జిక్యూటివ్.స్టార్టప్‌లను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం మరియు వ్యవస్థాపకత ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా అనంతపురము లోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేయడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ అవగాహన ఒప్పందం సంస్థలోని ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం మరియు ఔత్సాహిక విద్యార్థి వ్యవస్థాపకులకు నిర్మాణాత్మక మద్దతును అందించడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.ఎంఓయూ మార్పిడి తర్వాత, వర్క్‌షాప్ ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ జి. సౌమ్య ప్రసంగంతో ప్రారంభమైంది, పరిశోధన, మేధో సంపత్తి హక్కులు మరియు స్టార్టప్ ఇంక్యుబేషన్‌ను ప్రోత్సహించడానికి ఆర్ అండ్ డి సెల్ తీసుకున్న చొరవల గురించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు మరియు అధ్యాపకులలో డిజైన్ మరియు ఆవిష్కరణ ఆలోచనను ప్రోత్సహించడానికి సహకార చొరవలో భాగంగా పేటెంట్ దాఖలు మరియు ఆవిష్కరణ రక్షణలో విద్యార్థులు మరియు అధ్యాపకులకు మార్గనిర్దేశం చేయడంలో ఐపీఆర్ సెల్ పాత్రను ఆమె హైలైట్ చేశారు.తర్వాత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత విద్యలో ఆవిష్కరణ మరియు పరిశోధన సంస్కృతి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. స్థిరమైన మరియు ప్రభావవంతమైన స్టార్టప్‌లను అభివృద్ధి చేయడానికి ఆర్టీఐహెచ్‌తో ఒప్పందం ద్వారా సృష్టించబడిన అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.వర్క్‌షాప్ యొక్క రిసోర్స్ పర్సన్ మరియు ముఖ్య అతిథి డాక్టర్ ఆర్. హాఫీజ్ బాషా, పిహెచ్‌డి. (జపాన్), రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనంతపురము స్పోక్, నీటి అయోగ్ ఇనిషియలైజేషన్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుండి డిజైన్ థింకింగ్ మరియు క్రిటికల్ థింకింగ్ యొక్క ప్రభావవంతమైన వ్యూహాలపై విస్తృతమైన చర్చల వరకు అంతర్దృష్టితో కూడిన మరియు ఆకర్షణీయమైన సెషన్‌ను అందించారు, సమస్య గుర్తింపు, వినియోగదారు-కేంద్రీకృత విధానాలు, ఆలోచనా పద్ధతులు, ప్రోటోటైపింగ్ మరియు ధ్రువీకరణను నొక్కి చెప్పారు.ఆవిష్కరణ-ఆధారిత వ్యవస్థాపకత యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు మరియు నిర్మాణాత్మక ఆలోచనా పద్ధతులు ఆలోచనలను ఆచరణీయమైన స్టార్టప్‌లుగా ఎలా మార్చగలవో వివరించారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు మరియు తదుపరి విధానం ద్వారా గ్రాంట్‌ల యొక్క వివిధ వనరులపై సమాచారాన్ని ఆయన పంచుకున్నారు. విద్యార్థులు బూట్‌క్యాంప్‌లలో పాల్గొనవచ్చు, వారి ఆలోచనలను ప్రదర్శించవచ్చు మరియు దేశవ్యాప్తంగా పరిశ్రమ నిపుణుల నుండి మార్గదర్శకత్వం పొందవచ్చు అనే ప్రయోజనాలను ఆయన ప్రస్తావించారు. ప్రీ-ఇంక్యుబేషన్ సెషన్‌లలో విద్యార్థులు భవిష్యత్ వ్యవస్థాపకుల కార్యక్రమంలో భాగం కావచ్చు మరియు తరువాత క్యాటలిస్ట్ ప్రోగ్రామ్ ద్వారా నిధుల మద్దతుతో ఇంక్యుబేట్ చేయవచ్చు మరియు గ్రాంట్లు మరియు ఇతర సీడ్ ఫండ్‌లను పొందవచ్చు. చివరగా విద్యార్థులు వెంచర్ క్యాపిటలిస్టుల పెట్టుబడులను పొందడానికి వెలాసిటీ ప్రోగ్రామ్‌లో భాగం కావచ్చు. వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సృజనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా మరియు వ్యవస్థాపకంగా ఆలోచించడానికి విద్యార్థులను ఆయన ప్రసంగం ప్రేరేపించింది.ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థి రాయబారులు, ఫ్యాకల్టీ రాయబారులు మరియు వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొనేవారు చర్చలు, ఆలోచనలను పంచుకోవడం మరియు డిజైన్ ఆలోచనా చట్రాల ఆచరణాత్మక అవగాహనలో పాల్గొనడానికి వీలు కల్పించింది.మొత్తంమీద, ఈ వర్క్‌షాప్ ఆవిష్కరణ సంస్కృతిని బలోపేతం చేయడానికి ఒక విలువైన వేదికగా పనిచేసింది మరియు స్టార్టప్‌లను పెంపొందించడానికి మరియు విద్యార్థులలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి ఒక ఆశాజనక సహకారానికి నాంది పలికింది.

## దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 23 . (నంది పత్రిక ):నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం డేనియల్ పురం గేట్ సమీపంలో ఉన్న జి.పి. వెంకటస్వామి హిందుస్థాన్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని గుత్తి శ్రీహరి సౌజన్యంతో 40 వేల రూపాయల విలువ చేసే మూడు చక్రాల సైకిళ్లను అయిదు మంది దివ్యాంగులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా దాత శ్రీహరిని నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,అధ్యక్షులు ఎం.పీ.వీ. రమణయ్యలు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు.గుత్తి శ్రీహరి భవిష్యత్ లో కూడా దివ్యాంగులకు సహకారం అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.పి. వెంకటస్వామి హిందుస్థాన్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ అకౌంటెంట్ మోహన్,లయన్స్ క్లబ్ సభ్యుడు రామయ్య, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు, సూర్య,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 అర్జీలు**



కర్నూలు నంది పత్రిక..... ప్రతి అధికారి ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పీజిఆర్‌యస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 22 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్‌ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 122 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**



కర్నూలు నంది పత్రిక..... కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 122 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) కర్నూలు , వి ఆర్ కాలనీ కి చెందిన మద్దూరి రవితేజ గిఫ్ట్ షాపు నడుపుతూ తన పిల్లలకు బాగా లేదని హాస్పిటల్ లో అత్యవసర ఖర్చులు ఉన్నాయని అబద్ధాలు చెబుతూ, ఫైనాన్స్ పేరుతో మహిళల నుండి లక్షలలో డబ్బులు తీసుకొని నమ్మించి , శ్రీరామ్ ఫైనాన్స్ లో ష్యూరిటి తీసుకొని మోసగించాడని, బాధితులకు లీగల్ నోటీసులు వచ్చాయని, పరారీలో ఉన్నాడని కర్నూలు వెంకటరమణ కాలనీ కి చెందిన మహిళలు ఫిర్యాదు చేశారు. 2) గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో స్టాఫ్ నర్స్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి పేరుమాళ్ళ శ్రీనివాసులు రూ. 2 లక్షల 80 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు , విష్ణు టౌన్ షిప్ కు చెందిన శాంతకుమారి ఫిర్యాదు చేశారు 3) ఎలక్ట్రిసిటి డిపార్ట్ మెంట్ లో బిల్ కలెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి భాను ప్రతాప్ రెడ్డి రూ. 3 లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశాడని చర్యలు తీసుకోవాలని నన్నూరు రాగమయూరి కి చెందిన ప్రసన్న కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. 4) ఎమ్మిగనూరు బంగారు షాపులో కుదువ పెట్టిన వెండి ని ఇవ్వడం లేదని వారి పై చర్యలు తీసుకోవాలని పత్తికొండ పట్టణం కు చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు. 5) రెవిన్యూ డిపార్ట్ మెంట్ లో క్లర్క్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి దీప్తి కిరణ్ రూ. 3 లక్షలు తీసుకొని మోసం చేశాడని చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూలు, బి.క్యాంపు కు చెందిన హైమావతి ఫిర్యాదు చేశారు. 6) కోడుమూరులో మా ఇంటి ముందు ఉన్న రస్తాను ఆక్రమించి రాక పోకలకు అడ్డంగా నిర్మాణాలు చేసి ఇబ్బందులు కలిగిస్తున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని కోడుమూరు రాజ వీధి కి చెందిన లావణ్య ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా , సిఐలు రామక్రిష్ణ , విజయలక్ష్మి, మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# అవినీతి కేరాఫ్ అడ్రస్‌గా మారిన

# రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ను తొలగించాలి:



**ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, పిడిఎస్యు, ఆర్పిఎస్ఎఫ్**

**యూనివర్సిటీ ఖజానా ఖాళీ అవుతున్న.. కళ్ళుండి చూడలేని పరిస్థితుల్లో యూనివర్సిటీ అధికారులు ...**

**కళ్ల గంతలు కట్టుకొని విద్యార్థి సంఘాల నిరసన**

**వీసీ హామీ ఏమైంది? రిజిస్ట్రార్‌పై తొలగించకపోతే ఉద్యమం ఉధృతం:**

**ఏఐఎస్ఎఫ్,ఏఐఎస్ఏ,పిడిఎస్యు,ఆర్పిఎస్ఎఫ్**

కర్నూలు నంది పత్రిక..... రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్,ఏఐఎస్ఏ, పిడిఎస్యు,ఆర్పిఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతూ విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ముందు ధర్నా చేపట్టారు.అనంతరం వైస్ ఛాన్సలర్ క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించి తమ ఆందోళనను ఉధృతం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ కుమార్, ఆర్పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ... రాయలసీమ యూనివర్సిటీలో రోజురోజుకు అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయని యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు అధికారులకు కనిపించడం లేదా? లేదా యూనివర్సిటీ ఖజానా ఖాళీ అయ్యే వరకు కన్పించవా ? లేకపోతే అవినీతిలో వారికి కూడా వాటా ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు .యూనివర్సిటీకి సంబంధించిన రూసా నిధుల వినియోగం, కాన్వొకేషన్ బిల్లులు, టెండర్లు అలాగే రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి చేపట్టిన పలు పనుల్లో తీవ్ర అవినీతి, అక్రమాలు జరిగాయని ముందే పనులు చేసి తర్వాత టెండర్ల నాటకం ఆడుతూ నచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టి కమిషన్ల దందా నడుపుతున్నారని ఆరోపించారు. అర్హతలేని వారితో కొటేషన్లు వేయిస్తూ యూనివర్సిటీ నిధులకు గండి కొడుతున్నారని రిజిస్ట్రార్ అక్రమాలపై తరచూ వార్తా కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ దెబ్బతింటోందని తెలిపారు. గతంలో రిజిస్ట్రార్ పదవీకాలం ముగిసిన తరువాత కేవలం కాన్వొకేషన్ నిర్వహణ కోసమే కొనసాగిస్తున్నామని, అనంతరం పంపిస్తామని వైస్ ఛాన్సలర్ విద్యార్థి సంఘాలకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.ఈ దోపిడీ వ్యవహారాలన్నింటిని వైస్ ఛాన్సలర్ చూసిన చూడనట్లు వ్యవహరించడం వెనుక లోతైన సంబంధాలున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా తక్షణమే రిజిస్ట్రార్‌పై సమగ్ర విచారణ జరిపి, ఆయనను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తరగతుల బహిష్కరణ, నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీలు నిర్వహిస్తామని ప్రకటించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలను ఐక్యం చేసి పోరాటాన్ని విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి యూనివర్సిటీ నాయకులు మౌలాలి, రామ్, మధు,శీనాథ్, కిరణ్,తేజ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి కి మంత్రాలయంలో ఆత్మీయ వీడ్కోలు

కర్నూలు, నంది పత్రిక..... కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి కి సోమవారం మంత్రాలయంలో నాయకులు, మఠం పెద్దలు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు తెలిపారు.ప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువై ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల శాఖా మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామి వారి గురు వైభవోత్సవాల సందర్భంగా ఆదివారం మంత్రాలయానికి విచ్చేసిన ఆయన, ఉత్సవాలలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. మంత్రివర్యులు ఆదివారం రాత్రి మంత్రాలయంలో బస చేసి, సోమవారం గురు వైభవోత్సవం లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనగా మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారు శేష వస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. శ్రీమఠంలో జరిగిన కార్యక్రమాలు భక్తి భావనతో, శ్రద్ధాసక్తులతో కొనసాగాయి. కేంద్ర మంత్రి వారు.. మంత్రాలయ పుణ్యక్షేత్ర మహిమను కొనియాడుతూ, దేశ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు. అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకున్న కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి ని అధికారులు, ప్రజాప్రతినిధులు, మఠం పెద్దలు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు మంత్రివర్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, తాసిల్దార్ రమాదేవి, మఠం పెద్దలు, నాయకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసేంతవరకు పోరాటం ఆగదు -సీఐటీయూ




నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 23 . (నంది పత్రిక ):అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యల పైన స్పందించాలని పరిష్కారం చేయాలని పరిష్కారం చేసేంతవరకు పోరాటం ఆగదని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అని ఏర్పడిన రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 23, 24, 25 తేదీ లలో ప్రాజెక్టు ల లో నిరసనలు అనంతరం 26 27 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అప్పటికి స్పందించకుంటే మార్చి 2న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడీలంతా సిద్ధం కావాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎం నిర్మలమ్మ పిలుపునిచ్చారు.టేక్కే మార్కెట్ యార్డ్ నుండి స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు చేరుకుని ఎండలను సైతం లెక్కచేయకుండా గంట పాటు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, జిల్లా సీనియర్ నాయకులు తోటమద్దులు, సిఐటియు జిల్లా కార్యదర్శి డి లక్ష్మణ్, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్,పి వెంకట లింగం, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా నాయకురాలు డి నిర్మల వసంత,నాగరాణి, లలితమ్మ వీరితోపాటు మరో 150 మంది అంగన్వాడి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.అనంతరం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి సునీత కార్యక్రమానికి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఎం.నిర్మల, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు లు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000/-లు ఇవ్వాలని,పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలక్సేషన్ ఇచ్చి మెయిన్సెంటర్లుగా మార్చాలని,గ్రాట్యూటి అమలుకు గైడ్ లేన్స్ రూపొందించాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని,అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ తేడీ లేకుండా అందరికీ అమలు చేయాలని,హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లెన్స్ రూపొందించి అమలు చెయ్యాలని,పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని,మే నెల అంతా వేసవి సెలవుల జీఓ వెంటనే ఇవ్వాలని,లబ్ధిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలి. మెనూచార్జీలు పెంచాలి. ఉచితంగా గ్యాస్ సరఫరా చెయ్యాలని,ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. 5 సంవవత్సరాల్లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీవో ఇవ్వాలి.

ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని గత రెండు సంవత్సరాలుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు తెలిపిన ప్రభుత్వం స్పందించడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల స్పందించి పరిష్కారం చేయాలని లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, నంది పత్రిక... ..అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ కూడా బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకూడదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు రీ ఓపెన్ కాకూడదన్నారు.. అదే విధంగా ఎట్ టు వ్యూ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను చూడాలని, అర్జీదారులతో మాట్లాడి, సమస్యలను పరిష్క రించాలని, ఎండార్స్మెంట్ స్పష్టంగా ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదే శించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్, రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఇంటర్మీడియట్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత...

**ఎస్పీ ఆదేశాలతో భద్రతను పర్యవేక్షించిన పోలీసు అధికారులు.**





కర్నూలు నంది పత్రిక........ కర్నూలు జిల్లావ్యాప్తంగా సోమవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల పనితీరును పర్యవేక్షిస్తూ నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా , పరీక్షలు నిర్వహించే ప్రాంగణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

## ఘనంగా స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్ గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలు...

**అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీగా 100 బైకులతో ర్యాలీ....**



గోస్పాడు::(నంది పత్రిక) అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంతు గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలు ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా 100 బైకులతో యాలూరు నుండి రజక సంఘం వారంతా నాయకులు తో బైకు ర్యాలీ తో తిరుగుతూ గోస్పాడు మండల కేంద్రమైన నంద్యాలబి కోవెలకుంట్ల జాతీయ రహదారి వరకు వచ్చి, అనంతరం అభిరుచి మధు, రజక సంఘంతో కలిసి కాలినడకతో జిఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం గోస్పాడు మండల కేంద్రంలోని జిఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రాంగణంలో సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అభిరుచి మధు పాల్గొని సంతు గాడ్గే బాబా తన జీవితాంతం సమాజ హితం కోసం పాటుపడ్డారన్నారు. అనంతరం అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సభ మీటింగ్ లో మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పితామహుడు సంతు గాడ్గే బాబా చరిత్రలో పరిశుభ్రతే దైవమని నిర్వహించిన తొలి సంఘ సంస్కర్త అని అన్నారు. పకృతిని కాపాడుకోవాలని చెప్పినా, పర్యావరణ వాది ఆయన జీవిత చరిత్ర నేటి, రేపటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఆయన వివరించారు. ఆయన సన్యాసిగా జీవనం కొనసాగిస్తూనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, అందులో భాగంగా పరిసరాలు పరిశుభ్రత, విద్యా దానం, కుల వివక్ష నిర్మూలన, జంతుబలిని నిషేధించడం ఈ అంశాలపై జీవితాంతం పోరాటం చేశారు. ఆయన 150 పాఠశాలలు ఏర్పాటు చేసినందుకు ఆయన సేవలను గుర్తించి, మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఆయన పేరుమీద ఒక విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు చేశారన్నారు. ఆ గౌరవంతోనే భారత ప్రభుత్వం స్వచ్ఛభారత్ అనే కార్యక్రమాన్ని ఆయన పేరు మీదనే నిర్వహించడం జరిగిందన్నారు. ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన హాజరైన నాయకులకు,రజక సంఘ వారికి ప్రత్యేకంగా ఆహ్వానించి, పలు రకాల వంటకాలతో అతిథ్యం కల్పించారు. ఇంతటి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంను రజక సంఘం వారు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, ఓ బి సి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, బంగారయ్య, శ్రీరాములు , రజక సంఘం నాయకులుచిన్న నాగయ్య, మద్దిలేటి ,సుబ్బయ్య ,ఎల్లప్ప, ఆళ్లగడ్డ శంకర్, చిన్న మద్దిలేటి, సునీల్, మద్రిపల్లె నాగరాజు, ఎడవల్లి బ్రదర్స్, దొర్నిపాడు మోహన్ ,మహేంద్ర, నాగమద్దిలేటి ,తదితరులు, పాల్గొన్నారు.

# అత్యాధునిక వైద్య సదుపాయాలతో ప్రీతి కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం





**- సుచిత్రలో ప్రీతి కిడ్నీ హాస్పిటల్స్ 50 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం**

హైదరాబాద్, నంది పత్రిక.... హైదరాబాద్ నగరంలోని సుచిత్ర సర్కిల్ పరిధిలో యూరాలజీ, నెఫ్రాలజీ ప్రత్యేక వైద్య సేవలందిస్తున్న ప్రీతి కిడ్నీ హాస్పిటల్స్ తమ నాల్గవ శాఖను సుచిత్ర సర్కిల్, కొంపల్లి ప్రాంతంలో 50 పడకల అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఆదివారం ప్రారంభించింది. ఈ కేంద్రం సుచిత్ర, కొంపల్లి, ఆల్వాల్, బొల్లారం తదితర ఉత్తర హైదరాబాద్ ప్రాంత ప్రజలకు ప్రత్యేక కిడ్నీ,మూత్రవ్యవస్థ వైద్య సేవలను అందించనుంది. ఈ సందర్భంగా ప్రీతి హాస్పిటల్ డైరెక్టర్ డా. చంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రీతి హాస్పిటల్ లో తాజా తరం ఎస్ఎస్ఐ మంత్రా రోబోటిక్ సర్జరీ సిస్టమ్ 3.0, కిడ్నీ రాళ్లు, ప్రోస్టేట్ చికిత్సకు ఉపయోగించే 160 వాట్స్ హోల్మియం లేజర్ సాంకేతికతను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రెండు అత్యాధునిక సదుపాయాలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉండటం తెలుగు రాష్ట్రాల్లో అరుదైన విషయమని నిర్వాహకులు తెలిపారు. జీవనశైలి మార్పులు, మధుమేహం, రక్తపోటు కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, తొందరగా గుర్తిస్తే కిడ్నీ వైఫల్యాన్ని నివారించవచ్చని తెలిపారు. సమాజానికి అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్యం అందించడం తమ లక్ష్యమని చెప్పారు. ఈ పద్ధతుల వల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రూపా పుట్టా మాట్లాడుతూ తక్కువ నొప్పితో, త్వరగా కోలుకునే విధంగా మినిమల్లి ఇన్వేసివ్ మరియు రోబోటిక్ శస్త్రచికిత్సలపై ఆసుపత్రి ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రీతి కిడ్నీ హాస్పిటల్స్ ఇప్పటికే కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్,కొండాపూర్ కేంద్రాల్లో సేవలందిస్తుండగా, సుచిత్ర కేంద్రం ద్వారా ఉత్తర హైదరాబాద్ ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. భవిష్యత్తులో కిడ్నీ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ , ఎమ్మెల్యే శ్రీ కేపి వివేకానంద గౌడ్,ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హన్మంత్ రావు, కార్పొరేటర్ భారతసింహా రెడ్డి, గౌరవ అతిథిగా సీనియర్ యూరాలజిస్టు డా. ఎం.ఎ. రావూఫ్, కిడ్నీ స్పెషలిస్ట్ లు, డాక్టర్లు, హాస్పిటల్ స్టాఫ్,తదితరులు పాల్గొన్నారు.

# జనగణన శిక్షణకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి



**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 23(నంది పత్రిక):– జిల్లాలో నిర్వహించనున్న జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ నెల 24, 25, 26 తేదీలలో మూడు రోజులపాటు జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జనగణన శిక్షణ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, శిక్షణ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై, అందించే మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమం అయ్యలూరు మెట్టలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబడుతుందని, ప్రతిరోజూ ఉదయం 9.00 గంటలకల్లా హాజరు కావాలని స్పష్టం చేశారు. అధికారులకు ఎటువంటి సెలవులు లేదా మినహాయింపులు అనుమతించబడవని తెలిపారు. జిల్లా కలెక్టర్ (ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్), జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సబ్ డివిజనల్ స్థాయి ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 164 మంది అధికారులను మూడు బ్యాచ్‌లుగా విభజించి, పూర్తి స్థాయి ఆన్‌లైన్ మరియు హ్యాండ్స్-ఆన్ విధానంలో శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా సిఎంఎంఎస్ యాప్ ద్వారా ఎన్యుమరేటర్లకు ఆర్డర్లు జారీ చేయడం, బ్లాక్‌ల విభజన, డేటా నమోదు విధానం వంటి కీలక అంశాలపై రాష్ట్ర స్థాయి బృందం ప్రత్యక్షంగా శిక్షణ అందించనుందని కలెక్టర్ తెలిపారు. జనగణన వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, శిక్షణలో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




# డాక్యుమెంట్ అప్‌లోడింగ్ లో వేగం పెంచండి



**ఏకీకృత కుటుంబ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 23(నంది పత్రిక):– జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలులో అధికారులు మరింత బాధ్యతతో, వేగవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈ పి టీ ఎస్ అప్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రతి సోమవారం ప్రత్యేకంగా ఈ అంశంపై సమీక్షిస్తానని అధికారులకు సూచించారు. డాక్యుమెంట్ సబ్మిషన్ లక్ష్యాన్ని 13 లక్షల నుండి 15 లక్షలకు పెంచినట్లు తెలిపారు. పెరిగిన లక్ష్యాన్ని సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రతి మండల స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏకీకృత కుటుంబ సర్వే పూర్తి చేయడానికి ఈ నెల 28 చివరి తేదీగా నిర్ణయించబడిందని పెండింగ్ లో ఉన్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ఆదేశించారు. గడువు లోపు సర్వే పూర్తి చేసి వివరాలను సమగ్రంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు, పారిశుధ్యం, బస్సు సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలు సరైన రీతిలో కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను అనుమతించవద్దని స్పష్టంగా ఆదేశించారు. ఉద్యోగుల నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇగోట్ కోర్సులను ఏర్పాటు చేసిందని....ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం 40 ఇగోట్ ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల ద్వారా అందుబాటులో ఉన్న వాట్సాప్ సేవలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, ఎక్కువ మంది వినియోగించుకునేలా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి 3,330 ఖాతాలు ప్రక్రియ చేయాల్సి ఉందని ఈ నెల 27వ తేదీలోగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునర్దించాలి. ఏఐటీయూసీ



కర్నూలు నంది పత్రిక...... ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం కార్మిక సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సమితి పిలుపుమేరకు నేడు కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా నిర్వహించడం జరిగింది అనంతరం జిల్లా కలెక్టర్ ఏ .సిరి మేడం కి కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి. బి .వెంకటేష్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి అధ్యక్షతనగా డి. నల్లన్న అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా ఏఐటియుసి జిల్లా నాయకులు కామ్రేడ్.. లెనిన్ బాబు పాల్గొన్నారు. ఈ ధర్నా ఉద్దేశించి జిల్లా నాయకులు లెనిన్ బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కన్స్ట్రక్షన్ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 17 తీసుకొచ్చి సంక్షేమ బోర్డు నిధులు ప్రభుత్వ పథకాలకు వాడుకొని భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న డబ్బులను బోర్డుకి జమ చేసి కార్మికులను ఆదుకోవాలి అదేవిధంగా పెండింగ్ లో ఉన్న 46వేల క్లామ్స్ ప్రమాద, సహజ మరణం , పెళ్లి కానుక,మెటర్నిటీ, డిజబులిటీ తదితర పథకాలని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నగర కార్యదర్శి బి వెంకటేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత డబ్బులతో కోటి రూపాయలు ఇస్తానని గౌరవ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ నేడు ఏమైందని వారు ఎదేవా చేశారు. మరియు యువగలం పాదయాత్ర లో గౌరవ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ఏమైందని వారు విమర్శించారు. తక్షణమే ఇచ్చిన హామీలను విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకొని వారికి ఇసుక , సిమెంటు, ఇనుము, ముడి సరుకులు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హామీలను విడుదల చేయాలని లేని పక్షంలో భవన నిర్మాణ కార్మికులను కలిసివచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు రస్తా,రోకాలు చేపడతామని వారు డిమాండ్ చేశారు.. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి టి. రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ కృష్ణారెడ్డి, బిల్డింగ్ జిల్లా నాయకులు రెహమాన్ ,కల్లూరు మండల కార్యదర్శి ఎం. రేణుక,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు రవికుమార్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, రాము, ఇర్మియ ,ధరన్న, రంగన్న, రేణుకమ్మ, పాల్గొన్నారు



# ప్రజా ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండండి





## రీఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి

## పిజిఆర్ఎస్‌లో 311, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 176 అర్జీల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 23(నంది పత్రిక):–** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో తమ సమస్యలను సమర్పిస్తారని, వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదన్నారు. ప్రస్తుతం 53 దరఖాస్తులు ఇంకా ఓపెన్ చేయలేదని, వాటిని తక్షణమే పరిశీలించాలని సూచించారు. అర్జీదారుల అసంతృప్తి కారణంగా 283 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని, అలాంటి అర్జీలపై సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సంతృప్తికర పరిష్కారం అందించాలని ఆదేశించారు. ఇంకా 2,455 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని, నిర్ణీత గడువులోగా వాటిని పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చిన అర్జీలను కూడా అదే ప్రాధాన్యతతో పరిష్కరించడం అధికారుల బాధ్యత అని తెలిపారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్య అర్జీలు** మిడ్తూరు మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన కె. రమణా రెడ్డి, సర్వే నం. 485లో ఉన్న తన 7 ఎకరాల భూమిలో 4 ఎకరాలపై విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో తగిన నష్టపరిహారం అందలేదని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన సంగిరెడ్డి శివమ్మ, సర్వే నం. 119, 120లలో ఉన్న 2.50 ఎకరాల భూమికి భర్త మరణించిన నేపథ్యంలో తన పేరుపై పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అభ్యర్థించారు. సిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన ముల్లా మహబూబ్ బీ, సర్వే నం. 526/2ఎలో ఆన్‌లైన్‌లో భూవిస్తీర్ణం తక్కువగా నమోదైన విషయాన్ని సరిదిద్దాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 311 మంది అర్జీదారులు తమ సమస్యలను నమోదు చేసుకున్నారు. స్వీకరించిన అర్జీలన్నింటినీ సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 176 అర్జీలు** భూ సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే సమస్యలను పరిశీలించి వేగంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 176 అర్జీలు స్వీకరించబడినట్లు వివరించారు. వాటిలో రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి – 5, అడంగల్ సవరణలు – 59, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22–ఎ భూములు – 13, అసైన్డ్ భూములు మరియు భూఆక్రమణలు – 33, రెవెన్యూ కోర్టు విచారణలు మరియు ఆర్ఓఆర్‌కు సంబంధించినవి – 26, సర్వే మరియు రీ–సర్వే అంశాలు – 38, దేవాదాయ మరియు వక్ఫ్ భూములు – 2 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సందర్శనకు వచ్చిన విద్యార్థులతో మంత్రివర్యుల ఆత్మీయ సంభాషణ



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 23 ( నంది పత్రిక )** ఏపీ అసెంబ్లీ సమావేశాలను వీక్షించేందుకు వచ్చిన బాపట్ల జిల్లా వెద్దులపల్లి జెడ్పీ హై స్కూల్ విద్యార్థులను మంత్రి సవితమ్మ తో కలిసి రాష్ట్ర న్యాయ , మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు చీఎం ఫరూక్ సాదరంగా ఆహ్వానించి ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల నిర్వహణ విధానం, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు చేస్తున్న చర్చలు, చట్టాల రూపకల్పన ప్రక్రియ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థులు ఆసక్తిగా అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని, రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రులు విద్యార్థులకు పిలుపునిచ్చారు.



# కూటమి ప్రభుత్వం లో మాదిగలకు భద్రత కరువు

## ఏపీ ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి కమతం పరుశురామ్ మాదిగ



**కర్నూలు నంది పత్రిక......** మాదిగల చావులపై స్పందించని కూటం ప్రభుత్వంపై మాదిగలు తాడోపేడో తేల్చుకోవడానికి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామని ఆంధ్ర ప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి కమతం పరుశురామ్ మాదిగ మాట్లాడుతూ : రాష్ట్రంలో మాదిగలపై జరుగుతున్న దాడులు, హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, బాధిత కుటుంబాలకు న్యాయం అందడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మాదిగల ప్రాణాలు పోతున్నా కూటమి ప్రభుత్వం వైశాచిక ఆనందం పొందుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మాదిగలపై జరుగుతున్న హత్యలు మరియు దాడుల కేసులను వేగంగా విచారించి నేరస్తులకు కఠిన శిక్షలు విధించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 25-02-2026 తేదీన కర్నూల్ నగరంలోని రాజు విహార్ అంబేద్కర్ భవనం లో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి మాదిగ సంఘాల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. అలాగే కర్నూలు జిల్లా పరిధిలోని గ్రామ, మండల, టౌన్ మరియు అన్ని నియోజకవర్గాల దళిత సంఘాల నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. మాదిగలపై జరుగుతున్న దాడులను అరికట్టే వరకు, బాధితులకు తక్షణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామని స్పష్టం చేశారు. అందరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్ద రాజశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎం గిద్దయ్య మాదిగ, కన్య మరకల వెంకటేష్ మాదిగ, శేషయ్య మాదిగ పాల్గొన్నారు.

# అంగన్వాడీ లకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వేతనం పెంచాలి. టీచర్స్

## సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ ల రిలే దీక్ష



**బనగానపల్లె ఫిబ్రవరి 23నందిపత్రిక** కూటమి ప్రభుత్వము ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని సోమవారము బనగానపల్లె లో ఎంపీడీవో కార్యాలయం ముందర అంగనవాడి టీచర్స్ మరియు వెల్ఫేర్ యూనియన్ ,సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడి కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లు హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం ఇతర డిమాండ్స్ అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం సుధాకర్, జె వి సుబ్బయ్య ,అంగనవాడి ప్రాజెక్టు అధ్యక్ష ,కార్యదర్శులు వెంకటలక్ష్మి, రోజా రమణి 2024 ఎన్నికల కంట ముందు వేతనాలు మరియు ఇతర డిమాండ్స్ పరిష్కారం చేయాలని 42 రోజుల పాటు అంగన్వాడీలు నిరవధిక సమ్మె నిర్వహించడం జరిగింది. అప్పటి ప్రభుత్వము అంగన్వాడి హెల్పర్స్ వేతనాల విషయంలో పట్టించుకోకపోవడంతో ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంగన్వాడీలు చేసే న్యాయమైన డిమాండ్ల కోసం మీ హామీలు అధికారంలోకి వస్తానే పరిష్కారం చేస్తామని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వము అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పైబడిన అంగనవాడిలా డిమాండ్లను పరిష్కారం చేయలేదని తక్షణమే ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచాలని మరియు ఇతర డిమాండ్స్ ను పరిష్కారం చేయాలని లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

# కుడా అప్రూవల్ లేకుండా లేఅవుట్లు వేసిన వారు, బిల్డింగులు కట్టిన వారు వెంటనే కుడా అనుమతులు తీసుకొని నిర్మాణం పనులు పూర్తిచేసుకోండి.

## కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూలు నంది పత్రిక.....** కుడా అప్రూవల్ లేకుండా లేఅవుట్లు వేసిన వారు, బిల్డింగులు కట్టిన వారు వెంటనే కుడా అనుమతులు తీసుకొని నిర్మాణం పనులు పూర్తిచేసుకొండి. విజ్ఞప్తి ఉమ్మడి కర్నూలు జిల్లా కుడా పరిధిలో కుడా అనుమతి లేకుండా ప్లాట్లు వేసుకున్న వారు, బిల్డింగులు నిర్మాణం చేసుకున్న వారు వెంటనే కర్నూలు నగరంలోని కుడా కార్యాలయానికి వచ్చి సంభందిత అధికారులను సంప్రదించి మీరు ప్రభుత్వంనకు చెల్లించ వలసిన రుసుమును తక్షణమే చెల్లించి తగిన అనుమతులను తీసుకోగలరనీ కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై వారు పత్రికల వారితో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి, విక్రయించిన వారికి, బిల్డింగులు నిర్మించుకున్నటువంటి వారికి ప్రభుత్వం ఒక అవకాశాన్ని ఇచ్చినందున ఈ సదసకాశాన్ని ఉపయోగించుకోవాలనీ విజ్ఞప్తిచేస్తున్నా.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ముందుగా కుడా అప్రూవల్ తీసుకొని ప్లాట్లు వేసుకొని విక్రయించుకోవాలనీ, అట్లు లేని పక్షంలో ప్లాట్లు కొన్న వారు ఇబ్బందులకు గురి అవుతారని తెలియజేస్తూన్నా. అందువల్ల ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కుడా కార్యాలయమునకు వచ్చి రుసుము చెల్లించి ప్లాట్ అప్రూవల్స్, బిల్డింగ్ అప్రూవల్ పొందాలని తెలియజేస్తున్నాను. అట్లు లేకుండా మీరు అలసత్వం వహించినటచో ప్రభుత్వం నుండి ఎలాంటి సౌకర్యాలు పొందలేరనీ, ముఖ్యంగా బ్యాంక్ లోన్స్ గానీ, కరెంట్, నీటి సౌకర్యము, రోడ్లు వంటి వాటికి దూరమౌతారనీ అందువల్ల ప్రతి ఒక్కరూ వెంటనే కుడా కార్యాలయానికి వచ్చి అప్రూవల్ చేసుకొని మీరు లాభం పొందండి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా తోడ్పడాలనీ ఆయన తెలియజేశారు.

# 3లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సిఐ,ఎస్ఐ

వైఎస్సార్ కడప జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ జరిపిన దాడుల్లో సీఐ కేవీ రమణ, ఎస్ఐ అనిల్‌లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసు విషయంలో బాధితుడిని నుంచి రూ. 3 లక్షల లంచం డిమాండ్ చేయడంతో అతను ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. దాంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో సీఐ, ఎస్ఐలను పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికాలు దాడులు చేశారు. పులివెందుల రూరల్ సీఐ, సింహాద్రిపురం ఎస్ఐలను ఈ దాడుల్లో ఏసీబీకి దొరికేశారు. పులివెందులలో అత్యంత వివాదాస్పద సీఐగా కేవీ రమణకు పేరుంది. తాజాగా పోలీస్ స్టేషన్‌లోనే లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం కేవీ రమణను మరింత ఇరకాటంలోకి నెట్టింది. మరోవైపు విజయనగరం జిల్లాలోని చాకివలస ఇంచార్జ్ వీఆర్వో ఏసీబీకి చిక్కారు. రూ. లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు ఇంచార్జ్ వీఆర్ఓ చిట్టిబాబు.

# ఏఐటీయూసీ నగర నూతన కమిటీ ఎన్నిక

## నూతన అధ్యక్ష కార్యదర్శులుగా. జి చంద్రశేఖర్



**కర్నూలు నంది పత్రిక.....** ఏఐటియుసి కర్నూల్ నగర 20వ మహాసభలు స్థానిక సిఆర్ భవన్ నందు జరగడం జరిగినది ఈ మహాసభల్లో నూతన అధ్యక్ష కార్యదర్శులుగా. జి చంద్రశేఖర్ బి వెంకటేష్. వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ కృష్ణారెడ్డి డిప్యూటీ కార్యదర్శి టి రామాంజనేయులు తో పాటు 59 మంది కౌన్సిల్ సభ్యులుగా 15 మంది ఆఫీస్ బేవర్స్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునియప్ప. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఇన్ కృష్ణయ్య ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది ఈ మహాసభల్లో కొన్ని కార్మికుల సమస్యలపై కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగినది ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఆటో ఆటో అమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు వి మహాసభల్లో నిర్ణయం తీసుకోవడం జరిగినది ఏఐటీయూసీ నాయకులు రాము పురుషోత్తం ఆనందు రమణ హర్ష వ్యక్తం చేశారు.

# ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

## -తహసిల్దార్ మాల ఉమారాణి

**కొత్తపల్లి – నంది పత్రిక:** అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు ఆయా శాఖల అధికారులతో కలసి ప్రజాసమస్యల పరిష్కార వేధిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ నందు అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి ధరఖాస్తుకు శాస్వత పరిష్కారం చూపిస్తామన్నారు. అందులో భాగంగా భూముల సర్వేకోసం 4 రైతులు, భూముల ఆన్లైన్ కోసం 2 ఇద్దరు రైతులు ధరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. వాటిని వెంటనే పరిష్కారం చేయాలని సిబ్బందికి సూచించామన్నారు.

# సునీల్ నాయక్ అరెస్ట్‌ను తప్పుపట్టిన పాట్నాకోర్టు

బిహార్‌లో పని చేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని పాట్నా కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఎఫ్ఐఆర్, కేస్ డైరీ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు రక్షణ ఉన్నప్పటికీ సునీల్ నాయక్‌ను బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని నిలదీసింది. పాట్నా హైకోర్టు చెప్పినప్పటికీ ఏపీ పోలీసులు రావడమేంటని ప్రశ్నించింది. 30 రోజుల వరకూ సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా రఘురామకృష్ణరాజు కేసు విషయానికి సంబంధించి సునీల్ నాయక్‌ను ట్రాన్సిట్

రిమాండ్‌ను పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించింది. బలవంతపు అరెస్టును బిహార్ లాయర్లు తీవ్రంగా ఖండించారు. ఏపీ పోలీసులు గోడదూకి మరీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బిహార్ పోలీసులు సైతం.. ఏపీ పోలీసుల తీరును తప్పుబట్టారు.

# దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

## జి.పి.వెంకటస్వామి పెట్రోల్ స్టేషన్ యజమాని గుత్తి శ్రీహరి సౌజన్యంతో ఐదుగురు దివ్యాంగులకు

## నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 23 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం డేనియల్ పురం గేట్ సమీపంలో ఉన్న జి.పి. వెంకటస్వామి హిందుస్థాన్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని గుత్తి శ్రీహరి సౌజన్యంతో 40 వేల రూపాయల విలువ చేసే మూడు చక్రాల సైకిళ్లను అయిదు మంది దివ్యాంగులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దాత శ్రీహరిని నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,అధ్యక్షులు ఎం.పీ.వీ. రమణయ్యలు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. గుత్తి శ్రీహరి భవిష్యత్ లో కూడా దివ్యాంగులకు సహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.పి. వెంకటస్వామి హిందుస్థాన్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ అకౌంటెంట్ మోహన్,లయన్స్ క్లబ్ సభ్యుడు రామయ్య, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు, సూర్య,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# రిలే నిరాహార దీక్షలు చేపట్టిన అంగన్వాడి కార్యకర్తలు.



**నందికొట్కూరు ఫిబ్రవరి 23( నంది పత్రిక)** అంగన్వాడి కార్యకర్తలతో వెట్టిచాకిరి చేస్తూ వారిపై పని భారం పెంచుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయడంలో విఫలమవుతున్నాయని, ఇకనైనా కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యానికి ఎదురుగా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని, తమ డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ ( సిఐటియు ) ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల శిబిరానికి సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బెస్తరాజు, సిఐటియు నాయకులు మరియు నాయకులు ఫకీర్ సాహెబ్ సంఘీభావం తెలిపారు. దీక్ష శిబిరం నందు అంగన్వాడి కార్యకర్తల నాయకురాలు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు నెలకు 26వేల కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 18 10 మినీ వర్కర్ల క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లు గా మార్చాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ రూరల్ అని తేడా లేకుండా అమలు చేయాలన్నారు. అదేవిధంగా హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 1064 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మే నెల అంతా వేసవి సెలవులుగా గుర్తించి జీవో ఇవ్వాలని, లబ్ధిదారులకు బియ్యం ఆయిల్ కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, మెనూ ఛార్జీలు పెంచుతూ ఉచితంగా గ్యాస్ సరపర చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు ఆకస్మిక తనిఖీ





**ఎటువంటి మాస్ కాపీ జరగడానికి వీల్లేదు**
**ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా**
**నిఘా ఉంచాలి అధికారులు ఆదేశాలు**
**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు,**
**సీసీ కెమెరాలతో పర్యవేక్షణ**
**నిబంధనల ప్రకారం విద్యార్థులను**
**సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి తరువాతే**
**లోపలికి అనుమతి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 23, నంది పత్రిక** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు భీమవరం మెంటే వారి జి వి ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, బ్రౌనింగ్ జూనియర్ కాలేజీలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సౌకర్యాలు, సీసీ కెమెరాల అమరిక, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులు పరీక్షలు వ్రాయడానికి చేసిన సిట్టింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పరీక్షలు ఎటువంటి అవకతవకలకు తావులేని విధంగా సజావుగా నిర్వహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికిలోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏలాంటి అక్రమాలు జరగకుండా నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు చేయాలని సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులను సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత లోపలికి అనుమతించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని ఎలాంటి అవకతవకలు చోటు చేసుకున్న వెంటనే సమాచారం అందించాలని సూచించారు. పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థుల నుండి సేకరించే జవాబు పత్రాలను సీసీ కెమెరాలు పర్యవేక్షణలో నిర్వహించి వెంటనే సీల్ చేసి నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని అన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంలో డిఐఓ గొల్ల ప్రభాకర రావు, డిఇసి కె.వి రామారావు, తదితరులు పాల్గొన్నారు



# ఏకీకృత కుటుంబ సర్వే, ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**







**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 23 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం లో సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఏకీకృత కుటుంబ సర్వే, పీ ఫోర్, ఈ కేవైసీ, ఈపిటిఎస్ ఫైల్స్ అప్లోడింగ్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో మండలాలు వారి ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 76% యుఎస్ఎఫ్ సర్వే పూర్తయిందని 24% సర్వే ప్రక్రియను ఈ వారం చివరి నాటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కొన్ని మండలాల్లో ఇప్పటికి యుఎస్ఎఫ్ సర్వే నూరు శాతం పూర్తయిందని సంబందిత సిబ్బంది ఈ కేవైసీ ప్రక్రియపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు నూరు శాతం సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పి4పై సమీక్షిస్తూ రాష్ట్రస్థాయిలో మన జిల్లా పీ4 లక్ష్యసాధనలో కొంత వెనుకబడి ఉందని, మార్గదర్శలతో బంగారు కుటుంబాలను అనుసంధానం ప్రక్రియలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఈపిటి ఎస్ ఫైల్స్ అప్లోడింగ్ పై సమీపిస్తూ మొగల్తూరు, పోడూరు ఇరగవరం, యలమంచిలి ఎంపీడీవోలు ఫైల్స్ అప్లోడింగ్ లో మంచి ప్రగతి సాధించారని, మిగిలిన మండలాలు కూడా లక్ష్యసాధనకు కృషి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అక్షరాంధ్ర నమోదు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నదని కావున అధికారులు ప్రత్యేక శ్రద్ధతో నూరు శాతం లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి కే సి హెచ్ అప్పారావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# పిజిఆర్ఎస్ లో అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



**అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా**
**నాణ్యమైన పరిష్కారం చూపాలి.**
**నేడు పి జి ఆర్ ఎస్ లో 204**
**దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్ లో 41**
**దరఖాస్తులు స్వీకరణ.**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

**భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 23, నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ పీజీ ఆర్ఎస్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డి ఆర్ ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి కె సి హెచ్ అప్పారావు, జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులకు నేరుగా తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కొన్ని ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నేరుగా ఆర్డీవోలు, తహసిల్దార్లతో వెబ్ఎక్స్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నేడు భూ సంబంధిత సమస్యలు, కొత్తగా వికలాంగ, వితంతు పెన్షన్లు, గృహ నిర్మాణం, ఇల్లు మంజూరు, సీనియర్ సిటిజన్స్ సమస్యలు, ఆరోగ్య అంశాలకు సంబంధించిన వివిధ సమస్యలపై ప్రజల నుండి పలు ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ రోజు అందిన అర్జీలలో కొన్ని పిర్యాదులు ఈ విధంగా ఉన్నాయి. భీమవరం మారుతి నగర్ 7వ వార్డుకు చెందిన బొక్క సత్యనారాయణ అర్జీ సమర్పిస్తూ తనకు బేతపూడి గ్రామంలో 94 సెంట్లు భూమి ఉందని, ఇటీవల చేసిన సర్వేలో నా భూమి 89 సెంట్లు మాత్రమే చూపిస్తున్నదని, 5 సెంట్లు భూమి తగ్గిందని తిరిగి సర్వే చేసి తగ్గిన 5 సెంట్లు కలిపి పట్టాదార్ పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు. భీమవరం పట్టణం 17వ వార్డుకు చెందిన గురజాడ వరలక్ష్మి అర్జీ సమర్పిస్తూ, తాను భీమవరం ఎంఎ కేఎ ప్రాథమిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పథకం వంట ఏజెన్సీగా 15 సంవత్సరాల నుండి పనిచేస్తున్నానని, తనను ప్రధానోపాధ్యాయులు కారణం లేకుండా వంట ఏజెన్సీ నుండి తొలగించారని, అధికారులు అనుమతి లేని వేరే వారితో వంట చేయించుకుంటున్నారన్నారని పీజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేస్తే తిరిగి ఏజెన్సీలో చేర్చుకోమని చెప్పిన తనను చేర్చుకోలేదన్నారు. ఇటీవల తన భర్త చనిపోయారని, కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉందని, పించను కూడా మంజూరు కాలేదని, దయచేసి తిరిగి వంట ఏజెన్సీగా నియమించాలని కోరారులి.భీమవరానికి చెందిన గిరిగి రవి సత్యప్రసాద్ తనకు రెండు నెలల క్రితం హై బీపీ మెదడును నరం చిట్లి కుడి ప్రక్క కాలు, చెయ్యి పని చేయడం లేదని, తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్నానని దయచేసి పించను మంజూరు చేయాలని సమర్పించారు.యనమదుర్రు గ్రామానికి చెందిన మండ సూర్యనారాయణ అర్జీని సమర్పిస్తూ, తనకు 86 సెంట్లు వ్యవసాయ భూమి ఉందని, 2009వ సంవత్సరంలో నా భార్య నుండి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, ఆ భూమి ఆన్లైన్లో 22ఖ లో దేవస్థానం భూమిగా చూపిస్తున్నదని, దయచేసి నా భూమి 22ఎ నుండి తొలగించాలని కోరారు భీమవరం మండలం చిన్న గురువుకు చెందిన గండికోట బాలాజీ అర్జీ సమర్పిస్తూ, వారి తల్లిగారు 6 వేలు వికలాంగ పించను పొందుతున్నారని, గత ఆరు సంవత్సరాలు నుండి ఇంటికే పరిమితమయ్యారని, దయచేసి 15 వేల రూపాయలు పించను మంజూరు చేయాలని కోరారు. వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్, దువ్వలో 3వ తరగతి చదువుతున్న వికలాంగ విద్యార్థి వీరమల్ల చేతన్ దుర్గకు స్కూల్ యాజమాన్యం పూర్తిగా ఉచిత విద్య, ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించడం పట్ల స్కూల్ యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. విద్యార్థి పాఠశాలలో ఉచితంగా చదువుకు, వాహన సౌకర్యం అందించేందుకు పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న డీఈవో ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.లి ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పోరుమామిళ్లలో ఆరోపణల కలకలం

**"మాపై చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యాలు" పచ్చా అంకమ్మ**



**పోరుమామిళ్ల ఫిబ్రవరి 23 (నంది పత్రిక ):**పోరుమామిళ్ల పట్టణంలో కుంటను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేశారంటూ రణి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పచ్చా అంకమ్మ (భర్త: చిన్న వెంగయ్య) కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలను రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని వారు సవాల్ విసిరారు. ఇటీవల తనపై వచ్చిన ఆరోపణలను తప్పించుకోవడానికి, తన భూములకు ఆధారాలు చూపించలేక తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, బెదిరింపులు సృష్టిస్తున్నాడని వారు ఆరోపించారు.అక్రమంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్లో ఓ బాలుడు మృతి చెందడానికి కూడా అతనే కారణమని తెలిపారు. అలాగే నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వాన్ని మోసగిస్తూ ప్రభుత్వ పెన్షన్ కూడా పొందుతున్నాడని ఆరోపించారు.సుమారు 50 ఎకరాల వరకు బినామీ పేర్లతో భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని తన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయాలపై అధికారులు, మీడియా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.




# తహాశీల్దార్ కార్యాలయం ముందు బిజెపి నాయకుల నిరసన



**కేసముద్రం, ఫిబ్రవరి 23(నంది పత్రిక):**బిజెపి నాయకుల అక్రమ అరెస్ట్ లకు నిరసనగా సోమవారం కేసముద్రం తహాశీల్దార్ కార్యాలయం ముందు బిజెపి నాయకులు మూతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాన్సువాడలో ఓ హిందూ మహిళపై మతోన్మాదులు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటనకు నిరసనగా బంద్ కి పిలుపునిచ్చిన బిజెపి-హిందూ సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పిరికి దుశ్చర్యను, సంతుష్టీకరణ రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వారిని వెంటనే విడుదల చేసి, అసలైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార అహంకారానికి, ప్రభుత్వ బెదిరింపులకు భారతీయ జనతా పార్టీ భయపడే ప్రసక్తే లేదని, అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలు కాషాయ ప్రభంజనాన్ని ఆపలేవు, తెలంగాణ సమాజం కోసం, ప్రజల హక్కుల కోసం బిజెపి నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అలుపెరగని పోరాటం ఇదేనని, ధర్మం గెలిచే వరకు పోరు ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పొదిల నరసింహారెడ్డి, కేసముద్రం మున్సిపాలిటీ కన్వీనర్ నాగేశ్వరా చారి, వెలిశాల సవీన్, సింగంశెట్టి మధుకర్, లంకలపల్లి శ్రీనివాస్, అనిల్, మంచు లక్ష్మీనారాయణ, బానోత్ సంపత్, చక్రధర్, రమేష్, వీరభద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# నేటి చిన్న చిన్న ప్రయోగాలే రేపటి విజయానికి బాటలు వేస్తాయి..





## నూతన ఆవిష్కరణలకు నిరంతరాయంగా ప్రయోగాలు జరగాలి ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులను ఉపాధ్యాయులు నిరంతరాయంగా ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 23 నంది పత్రిక ఉండి మండలం మహాదేవపట్నం గాదిరాజు అప్పల నరసింహారాజు జిల్లా పరిషత్ పాఠశాల నందు నిర్వహించిన "సైన్స్ సమగ్ర మహోత్సవ్ -2026" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులు తయారుచేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్ష మరియు ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ కలిసి సోమవారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో "సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2ఖ26" పేరిట విద్యార్థులతో సైన్స్ ఫెయిర్ ప్రదర్శనల నిర్వహణకు ఆదేశించడం జరిగింది. ఆలోచిద్దాం... పరిశీలిద్దాం... కొత్తది నేర్చుకుందాం... సైన్స్ తో భవిష్యత్తును నిర్మించుకుందాం అనే స్లోగన్ తో అన్ని పాఠశాలల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. దీనిలో భాగంగా ముగ్గురు విద్యార్థులు చొప్పున ఒక జట్టుగా ఏర్పడి గ్రూప్ ప్రాజెక్ట్ తయారు చేసి సమర్పించడం జరిగింది. ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన జట్టులకు రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా బహుమతి ప్రధానం చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు నిరంతరాయంగా చేపట్టడం ద్వారా ఉత్తమ ప్రాజెక్టును రూపొందించే అవకాశం ఉందన్నారు. నిరంతరాయంగా సాధన ద్వారా మంచి ఫలితాలను సాధించగలుగుతామన్నారు. విద్యార్థులు విద్యుతో పాటు వివిధ ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. చదువు ఒక్కటే కాదని, అన్ని రంగాలలో పరిణితి సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు.

**రుద్రరాజు జానకిరామరాజు, అరుణ దంపతులు దాతృత్వం అభినందనీయం** రుద్రరాజు జానకిరామరాజు, అరుణ దంపతులు, అమెరికాలో స్థిరపడిన వారి కుమారుడు రుద్రరాజు ఉదయ్ కుమార్ రాజు, అలేఖ్య దంపతులు సమకూర్చిన దాతృత్వం రూ.6.50 లక్షల రూపాయల వ్యయంతో ఎస్ జి ఏ ఎన్ ఆర్ జెడ్పి స్కూల్లో నిర్మించిన బహుళ ప్రయోజన ఓపెన్ ఆడిటోరియంను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఆడిటోరియం నందు ఏర్పాటుచేసిన షటిల్ కోర్టులో కొద్ది సమయం జిల్లా కలెక్టర్ షటిల్ ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా దాత రుద్రరాజు అరుణను జిల్లా కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. ఇటువంటి దాతలు సహకారంతో ఆ గ్రామం అభివృద్ధి చెందుతుంది అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది గ్రామ అభివృద్ధికి దోహదపడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



**పూర్వ విద్యార్థి కేఎన్ఆర్కే రాజు ను స్ఫూర్తి గా తీసుకోవాలి..** జడ్పీ స్కూల్లో చదువుకొని వ్యాపారంలో స్థిరపడిన పూర్వ విద్యార్థి కేఎన్ఆర్ కే రాజు ఆ పాఠశాలలో చదువుతున్న 70 మంది10వ తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, తదితర వస్తువులతో కూడిన కిట్ లను సమకూర్చగా వాటిని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి కేఎన్ఆర్ కే రాజు ను స్ఫూర్తిగా తీసుకొని మరింతమంది పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల గ్రంథాలయ చైర్మన్ జుత్తిగ నాగరాజు, డీఈఓ ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యామ్ సుందర్, ఏఎంఓ సిహెచ్ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దా జాన్ బాబు, స్థానిక నాయకుడు వనిమ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండ పోరంబోకు డి కె టి భూమిలో వెంగమాంబ విద్యాలయం అక్రమ నిర్మాణాలు



## రంగసముద్రంలో కోట్ల రూపాయల భూదందా కఠిన చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల ఫిబ్రవరి 23 ( నంది పత్రిక ): చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1261/2 కొండ పోరంబోకు డి కె టి భూమిలో వెంగమాంబ విద్యాలయం అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి ఆరోపించారు.రంగసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే నెంబర్ 1015లో సర్వే నెంబర్ 445కు సంబంధించిన 89 సెంట్లు కొండగా నమోదై ఉందని తెలిపారు. అయితే కొందరు స్వార్థపరులు ఈ భూములను ఆక్రమించి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం 1250 వరకు మాత్రమే సర్వే నెంబర్లు ఉండగా, 1251 నుంచి 1015 సర్వే నెంబర్ల మధ్య 445.89 సెంట్ల భూమి సబ్ డివిజన్లుగా చూపబడుతున్నట్లు తెలిపారు. ఇందులో సర్వే నెంబర్ 1261/2లో పచ్చా అంకమ్మ భర్త చిన్న వెంగయ్య పేరిట ఖాతా నెంబర్ 480లో 4.24 సెంట్లకు డి కె టి పట్టా ఇచ్చినట్లు కంప్యూటర్ అడంగల్ చూపుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం నిరుపేదలకు వ్యవసాయం చేసుకునేందుకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఇఖు పట్టాలు మంజూరు చేస్తుందని, కానీ ఆ భూమిలో వెంగమాంబ విద్యాలయం స్థాపించి దాదాపు 20కి పైగా భారీ భవనాలు నిర్మించి, వాటిని బయటి వ్యక్తులకు విక్రయిస్తూ కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు.రియల్ ఎస్టేట్ రూపంలో ప్లాట్లు విక్రయించి సుమారు 100 కోట్ల రూపాయలకు పైగా అక్రమ లాభాలు పొందినట్లు తెలిపారు. వెంగమాంబ పేరుతో విద్యాసంస్థలు ఏర్పాటు చేసి అక్రమంగా విద్యా వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తాసిల్దారు, విద్యాశాఖ అధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లకపోవడంతో అక్రమాలు మితిమీరాయని అన్నారు. కొండ పోరంబోకు డి కే టి భూమిలో 'వెంగమాంబ నగర్' అనే పేరుతో కాలనీనే నిర్మించారని పేర్కొన్నారు.



ఇలాంటి భూమిలో వెంగమాంబ విద్యాలయానికి కడప జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో విద్యాలయం వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అని ప్రశ్నించారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సర్వే నెంబర్ 1261లోని డి కె టి భూమిలో అక్రమంగా నిర్మించిన విద్యాలయ భవనాలు, ఇళ్లను కూలగొట్టి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ నిర్మాణాలు చేసిన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే సంవత్సరాలుగా ఈ డీకేటి భూమిలో విద్యాసంస్థ నడిచినప్పటికీ చర్యలు తీసుకోని జిల్లా, మండల విద్యాశాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి.

## జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 23(నంది పత్రిక):ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతులను ప్రాధాన్యత క్రమంలో స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అన్ని విభాగాల అధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా భూమి రికార్డుల సవరణ, వారసత్వ మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలన్నారు. సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం వచ్చిన అర్జీలను నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు. మురుగునీటి కాలువలు, త్రాగునీరు, విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన పూజరి సుశీల తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు సంబంధించిన స్లాబ్ పూర్తి చేసి వేరిఫికేషన్ పూర్తయి సాంక్షన్ కాని డబ్బులను వెంటనే ఇప్పించగలరని కోరారు. ఇనుగుర్తి మండలం మీట్యాతండకు చెందిన రైతులు తాము గత 30 సంవత్సరాల నుండి వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని అట్టి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ భూములకు పట్టాలను మంజూరు చేసి ఇవ్వాలని కోరారు. పట్టణంలోని బేతోల్ గ్రామానికి చెందిన గ్రామస్తులు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి వేరొకరికి అమ్మారని అట్టి స్థలాన్ని విచారణ చేసి సమస్యని పరిష్కరించాలని అన్నారు. సోమవారం ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 131 దరఖాస్తుల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్.పి సీఈఓ పురుషోత్తం, ముఖ్య ప్రణాళిక అధికారి



శ్రీనివాసరావు, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు శ్రీనివాసరావు, డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి రాథోడ్, జిల్లా వ్యవసాయ అధికారి సరిత, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డి.ఎం.సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, జిల్లా ఉపాధి అధికారి రజిత, ఎల్.డి.యం యాదగిరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెండెంట్ మదన్ మోహన్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ



కేసముద్రం, ఫిబ్రవరి 23(నంది పత్రిక):మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా రెండవ విడత 15 గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ హరీష్ మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీ విధులు బాధ్యతలు, పారిశుద్ధ్యం, చెట్లను పెంచడం, వృక్ష సంపద, వీధి దీపాల పర్యవేక్షణ, మరుగు దొడ్ల నిర్మాణాలు చేపట్టే చర్యలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు బాధ్యతలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ రాంమూర్తి, నాగార్జున, శ్రీను, రాజ్ కుమార్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సంఘం ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ కు సన్మానం.



కేసముద్రం, ఫిబ్రవరి 23(నంది పత్రిక):కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోనీ విలేజ్ కేసముద్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన మేకల శారద సురేష్ యాదవ్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఓటు వేసి గెలిపించిన ప్రజా సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మేకల శారద సురేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, వేల్పుల వెంకన్న, నిమ్మల సారయ్య, మేకల ఐలయ్య, కాసాని ఐలయ్య, బాషబోయిన వెంకన్న, కోడి కుమార్, నిమ్మల కుమార్, కషరబోయిన ఉపేందర్, సునీల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### ప్రముఖ సామాజికవేత్త రామాంజనేయులు



వెల్దండ ఫిబ్రవరి 23 : నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర జాతరలో కుల దురంకాహారంతో ఎస్సీ వర్గానికి చెందిన చిన్నారి హత్యకు పాల్పడిన అగ్రకుల ఆధిపత్య శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి దుండగులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ అత్యాచార కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వెల్దండ మాదిగల ఐక్యవేదిక మీడియా సంయుక్త కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. దళితుల ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొనడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్ ప్రెస్ క్లబ్లో గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన పోలీసులు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోని న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ వ్యక్తం చేశారు.

# ఉదారతను చాటుకున్న జక్కయ్య

### చర్చి నిర్మాణానినికి 20వేలు అందజేసిన వైసీపీ నాయకుడు.



మంత్రాలయం ఫిబ్రవరి 23, మంత్రాలయం మండలపరిది లోని బూదురు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బుజ్జీగి జక్కయ్య మరోసారి తన ఉదరతను చాటుకున్నారు. అనాధలకు ఆపదలో ఉన్న వారికి దేవాలయం నిర్మాణ లకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి నిరూపించాడు సోమవారం తన స్వగృహంలో చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేశారు గోనెగండ్ల మండలం పుట్ట పాశం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఏబీఎం చర్చి నిర్మాణానికి 20000 ఆర్థిక సహాయం సంఘ పెద్దలు రత్నమయ్య సుదర్శనం హనుమన్న హనుమంతు చిన్న సోమన్న మార్కు లకు అందజేశారు. పుట్టపాశం గ్రామానికి చెందిన సంఘ పెద్దలు జక్కయ్యను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా

మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది. సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది.

## అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 23 నంది పత్రిక** ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం నిమిత్తం విచ్చేయున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం గుడి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అహోబిల క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరియు భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.అహోబిల క్షేత్రంలోని మాడా వీధులను, క్యూలైన్లను పరిశీలించడంతో పాటు అక్కడ భక్తుల అవసరాలకు తగ్గట్టుగా త్రాగునీరు, ఇతర వసతులను ఏర్పాటు చేయాలన్నారు.ఎగువ అహోబిలం నందు కళ్యాణకట్ట,రథోత్సవం మరియు విగ్రహాలను ఊరేగించు పరిసర ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు సరైన పార్కింగ్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డిఎస్పి .ప్రమోద్ , ఆళ్లగడ్డ రూరల్ ఇన్స్పెక్టర్ బి.వి రమణ, సబ్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఆలయ స్పెషల్ అధికారి వి ఎల్ ఎన్ రామానుజన్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం సందర్శించినా ఫలితం శూన్యం.

**బిఆర్ఎస్ మాజీ జడ్పీ చైర్మన్ , నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి.**



**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 23(నంది పత్రిక )** ములుగు జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్, ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి మాట్లాడుతూ. సమ్మక్క బ్యారేజ్ దేవాదుల ఇంటెక్ వెల్ పనులను 90% బిఆర్ఎస్ గవర్నమెంట్ హయాం లోనే పూర్తి చేసామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడుసార్లు దేవాదులను సందర్శించిన ఫలితం శూన్యమనీ కేసీఆర్ ను తన నివాసంలో హోరిని యోగా చేయమనడం విడ్డూరమనీ తెలంగాణ ఉద్యమ సమయంలో లేని రేవంత్ రెడ్డి కెసిఆర్ కొట్లాడి సాధించి తెచ్చి పెట్టిన బిక్ష వల్ల తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు .సమ్మక్క సారక్క మహా జాతర మేడారానికి 1000 కోట్లు కేటాయిస్తామని చెప్పి 250 కోట్లు కేటాయించారని ఆ 250 కోట్ల రూపాయలకు లెక్క లేదన్నారు. తమ జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్నాడు అంటే తమ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని తమకున్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురుచూసే జనానికి మొండి చూపిందని, కాంగ్రెస్ సర్కార్ సమ్మక్క సారక్క మేడారం జాతర ఆధ్యాత్మికంగా కాకుండా కాంగ్రెస్ పార్టీ వారికి విహారయాత్ర లాగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్మ రమేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ ఆకుతోట చంద్రమౌళి, మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, కోకిల మహేష్, కౌన్సిలర్లు బైకని సునీత ఓదెలు, గోనెల భరత్, కోకిల లక్ష్మి, బైకని అనూష సాగర్, మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య,పోరిక విజయరాం నాయక్, గండి కుమార్, మాచర్ల ప్రభాకర్, అనుముల సురేష్ సర్పంచ్ బానోత్ సీతారాం, గరిగ రఘు, కాకి పురుషోత్తం, మంజల బిక్షపతి, రావి రామన్ ఉప సర్పంచ్ అన్న తిరుపతి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బెంగళూరు అత్యాచారం కేసులో బిగ్ ట్విస్ట్

బెంగళూరు నగరంలో సంచలనం సృష్టించిన 19 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి.. బాధితురాలితో పాటు ఓ జర్నలిస్టుపైనే ఎదురు ఫిర్యాదు చేయడంతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. డబ్బుల కోసం తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ నిందితుడు నిఖిల్ హెచ్.డి. (34) ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లేశ్వరం పోలీసులు బాధితురాలు, ఇమ్రాన్ అనే జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలు ఫిబ్రవరి 22న అత్యాచారంపై ఫిర్యాదు చేయగా, నిఖిల్ అంతకుముందే ఫిబ్రవరి 21న పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. నిఖిల్ తన ఫిర్యాదులో పలు కీలక విషయాలు వెల్లడించాడు. తాను సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేస్తానని, జక్కూరులో ఓ విల్లాను లీజుకు తీసుకుని రోజువారీ అద్దెకు ఇస్తానని తెలిపాడు. వాలెంటైన్స్ డే పార్టీ కోసం తన స్నేహితుడు డిక్సన్ ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు ఆ విల్లాను బుక్ చేసుకున్నాడని చెప్పాడు. పార్టీకి తాను కూడా వెళ్లానని, అక్కడ బాధితురాలు తనతో చనువుగా ప్రవర్తించిందని, తన కుటుంబ సమస్యలు చెప్పిందని పేర్కొన్నాడు. కారులో డ్రాప్ చేస్తున్నప్పుడు, తాను 'షుగర్ బేబీ' అని, తనకు 'షుగర్ డాడీ' కావాలని ఆమె చెప్పిందని నిఖిల్ ఆరోపించాడు. ఆ తర్వాత కొద్దిరోజులకు ఇమ్రాన్ అనే వ్యక్తి, తాను ఓ కన్నడ న్యూస్ ఛానెల్ క్రైమ్ చీఫ్‌నని చెబుతూ ఫోన్ చేశాడని నిఖిల్ తెలిపాడు. బాధితురాలికి డబ్బులు ఇచ్చి న్యాయం చేయాలని, లేదంటే ఛానెల్‌లో వార్తలు ప్రసారం చేసి తన పరువుతీస్తానని బెదిరించాడని ఆరోపించాడు. ఈ క్రమంలోనే తాను పోలీసులను ఆశ్రయించినట్టు వివరించాడు.

# అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ.





### వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం.

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.

**మహబూబాబాద్, ఫిబ్రవరి 23(నంది పత్రిక):**అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబల్, అన్ని వర్గాల పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక రాష్ట్రం ఇందిరమ్మ రాజ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన నిధులను వారికి కేటాయిస్తూ వారి కాలనీ యువత యువకుల విద్య అభివృద్ధి కోసం అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ప్రవేశపెట్టి ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపడం జరుగుతుందని, ఆర్థికపరంగా ఎదగడానికి చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించడం జరుగుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన వారికి న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పయనించి, విద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న చైర్మన్ కి మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ అధికారులు శ్రీనివాసరావు, దేశీ రామ్ నాయక్ తదితరులు స్వాగతం పలికారు. పట్టణంలోని 17వ డివిజన్, ఇల్లందు రోడ్డు ఎస్సీ కాలనీ సందర్శించి వారికి ప్రభుత్వ పరంగా అందించిన గృహాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇండ్లు, అంతర్గత రోడ్లు, కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహాశీల్దార్ రాజేశ్వర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.



**జిల్లాలో (8157) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు.**

**మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పరీక్షల నిర్వహణ.**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్.**

**మహబూబాబాద్, ఫిబ్రవరి 23(నంది పత్రిక):** సోమవారం మహబూబాబాద్ ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ 10వ తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2026లో పరీక్షల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి, హైదరాబాద్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు 2026 మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉదయం 9.30 నుండి 12.30 గంటల వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 45 కేంద్రాల్లో (8157) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఈవో రాజేశ్వర్, డీఎస్పీ తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో వడగళ్ల వాన బీభత్సం...



## పంటలకు తీవ్ర నష్టం..

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:(నంది పత్రిక)** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు(సోమవారం) అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది.

**కాళేశ్వరంలో వడగళ్ల వాన బీభత్సం..** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**సిద్దిపేట జిల్లాలో..** సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**నిర్మల్ జిల్లాలో..** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి.

**ఒక్కసారిగా మారిన వాతావరణం..** ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది.

**రైతులకు భారీ నష్టం..** వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**అధికారుల అప్రమత్తత..** వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.





## విద్యార్థుల ప్రతిభకు వేదికగా విజన్ స్కూల్ మండల స్థాయి సైన్స్ ఫేర్



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 23 ( నంది పత్రిక** ములుగు జిల్లావెంకటాపురంమండల కేంద్రంలోని, విజన్ స్కూల్ ఆధ్వర్యంలో, మండల స్థాయి సైన్స్ ఫేర్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల నిర్వాహకులు వెంకటరామారావు బాహుబలేంద్రుని ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సైన్స్ ఫేర్‌లో వెంకటాపురం మండలానికి చెందిన విజన్ స్కూల్, విశ్వజ్యోతి స్కూల్ మరియు వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం సుమారు 450 మంది విద్యార్థులు 160 వినూత్న ప్రాజెక్టులతో తమ ప్రతిభను ప్రదర్శించారు.విద్యార్థులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలు, సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు సందర్శకులనుఆకట్టుకున్నాయి.మండలంలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు సైన్స్ ఫేర్‌ను సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకత మరియు పరిశోధనా దృక్పథాన్ని అభివృద్ధి చేస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.ఈ సైన్స్ ఫేర్ విజయవంతం కావడానికి సహకరించినఉపాధ్యాయు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.



## వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా

### సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆనందం

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 23,( నంది పత్రిక ):** ఎన్పీడీసియల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గత ఏడాది మార్చి నెలలో 5,816 మెగావాట్లు ఉండగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి 21 నాటికి 5,904 మెగావాట్లకు చేరిందని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అ.ఆనందం తెలిపారు. రాబోయే వేసవిలో పీక్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు.వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో లోడ్ పెరుగుదల అంచనాల మేరకు ఓవర్‌లోడ్ అవుతున్న పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 33 పెంచినట్లు తెలిపారు. అదనంగా పలు 49 కొత్త పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట్ల రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఏడు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు, విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపరిచేందుకు 27.35 క కె ఎం 33/11 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. వేసవికాలంలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన , నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కంకణబద్ధంగా పనిచేస్తున్నారని సూపరింటెండింగ్ ఇంజనీర్ స్పష్టం చేశారు



## శ్రీకాకుళంలో డయేరియా కేసులు

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి నారాయణ

శ్రీకాకుళం జిల్లాలో డయేరియా కేసులు నమోదు కావడంపై రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ , నగరపాలక సంస్థ కమిషనర్‌తో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడి తాజా పరిస్థితిని సమీక్షించారు. డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణాలు ఏంటి? కలుషిత నీరా లేదా ఇతర ఆహారపు అలవాట్లా? అనే కోణంలో తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సాయం అందించాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యాధి మరింత విస్తరించకుండా ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి నాణ్యతను తనిఖీ చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. తాగునీటిని కాచి, వడపోసి చల్లార్చిన తర్వాతే తాగాలని అధికారులు సూచించారు. ఆహారంపై ఈగలు వాలకుండా జాగ్రత్త పడాలని, బయటి ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.

### ప్రజావాణికి 51 ఫిర్యాదులు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 23( నంది పత్రిక)** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 15, ఇందిరమ్మ ఇళ్లు 07, ఉపాధి కల్పనకు 06, పెన్షన్ 07, ఇతర శాఖలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్వయంగా కలెక్టర్ తో విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్ల పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్




**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 23, (నంది పత్రిక)** గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరం గల జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీమాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో మొత్తం నాలుగు పుష్కర ఘాట్లలను మంగపేట, ముళ్ళ కట్ట, రామన్నగూడెం, అంకన్నగూడెం పుష్కర ఘాట్ లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని,ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు మరుగుదొడ్లు పార్కింగ్ విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## యాసంగి రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు ఇవ్వాలి..

### ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా .



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 23 ( నంది పత్రిక)** ములుగు మండలంలోని యాసంగి రైతులకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా లేదా రంగాల చెరువు పైపులైన్ ద్వారా సాగునీరు ఈ ఆసంగి పంట కాలానికి ఇవ్వాలని ములుగు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని కూడా చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా పాల్గొని మాట్లాడుతూ... ములుగు మండలంలోని మదనపల్లి దేవగిరిపట్నం పత్తిపెల్లి కాసిందోపేట జంగాలపల్లి జగ్గన్నపేట పొట్లపూర్ మరియు ఏజెన్సీ గ్రామాల రైతులకు ఈ సంవత్సరం యాసంగి పంట కోసం ఎస్సారెస్పీ సాగునీరు లేదా రంగయ్య చెరువు పైపులైన్ సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని మరియు ములుగు జిల్లా అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. ములుగు మండలంలో సుమారు 8 ఎకరాలలో ఆయా పంటలను సాగు చేయడం జరిగిందన్నారు ములుగు మండలంలో సుమారు 8000 ఎకరాలలో ఆయా పంటలను సాగు చేయడం జరిగిందన్నారు. కావున ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని ఎస్ఆర్ఎస్పీ సాగునీరు లేదా రంగాయచెరువు పైప్ లైన్ సాగునీరు వెంటనే రైతాంగమునకు ఇచ్చి ఆదుకోవాలని ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగింది. లేనిచో ఈ ఆసంగి పంటలు వేసిన రైతాంగమును సమీకరించి ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయా ప్రభుత్వాలను హెచ్చరించడం జరిగింది. ఈ నిరసన వినతిపత్రం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు వటం సమ్మయ్య భూక్యాపురం సింగ్ ఆగబోయిన పోతాయా రమేష్ లింగమూర్తి సారయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2025-26 పథకానికి దరఖాస్తు ఆహ్వానం




**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 23 ( నంది పత్రిక )** ములుగు జిల్లా లోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం/గిరిజన/మత్స్య మార్కెటింగ్ సభ్యులకు /మత్స్య కృషీవలుల ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2025-26 సంవత్సరమునకు గాను మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స మంజూరు చేయుట కొరకై ఆసకై గల మత్స్య కారులు/ మత్స్య కృషీవలుల నుండి దరఖాస్తు కోరడం జరిగింది.ఈ క్రింద విధంగా సబ్సిడీ వివరములు తెలియజేచున్నాము.

**పథకము పేరు:** మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్

**యూనిట్ పేరు**కేటగిరి కేటాయించబడిన యూనిట్ సబ్సిడీ యూనిట్ విలువ ప్రభుత్వ సహాయం (సబ్సిడీ) లబ్దిదరుడి వాటా మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్

**దరఖాస్తు చేసుకోవడానికి** 1.పాన్ కార్డు 2. సొసైటి మెంబర్ అయితే సభ్యత్వ నంబర్ / సభ్యత్వ గుర్తింపు కార్డు 3. ఫార్మర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ 4. చేపలు క్రయవిక్రయములు చేస్తూ ఉండాలి 5. ఆదార్ కార్డు 6. డ్రైవింగ్ లైసెన్సు 7.కుల ధ్రువికరణపత్రం 8. దరఖాస్తు పారం నింపి జిరాక్స్ కాపీలు కార్యాలయం లో సమర్పించాలని వారు అన్నారు. ఇట్టి పథకం లో ఇతరాలకు (జనరల్ ) 40% సబ్సిడీ మరియు మహిళలకు మరియు ఎస్సీ ఎస్టీ ,లకు 60% సబ్సిడీ పై మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్ మంజూరు చేయబడును కావున ఆసక్తి గల అర్హులైన మత్స్య కారుల / మత్స్య కృషీవలుల అభ్యర్థులు పైన తెలిసిన మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్ మంజూరు కు జిల్లా మత్స్య శాఖా కార్యాలయం, లో 02.03.2026 లోపున సమర్పించిన వలసినదిగా జిల్లా జిల్లా మత్స్య శాఖాధికారి తెలిపారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com